

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | శనివారం 31-7-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 292 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగానికి సూచనలు ఆహ్వానించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జులై 30: జాతినుద్దేశిస్తూ చేసే ప్రసంగాలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తరచుగా దేశ పౌరుల నుండి సలహాలు, సూచనలు ఆహ్వానించే విషయం తెలిసిందే. ఈ క్రమంలో భాగంగానే తాజాగా స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగానికి ప్రధాని సూచనలు ఆహ్వానించారు. మీ ఆలోచనలు, సూచనలు ఆగస్టు 15న ప్రధాని ప్రసంగంలో చోటుచేసుకొని ఎర్రకోట ప్రాకారాల నుండి ప్రతిధ్వనిస్తాయి. అయితే ప్రధాని ప్రసంగం కోసం మీ ఇన్‌పుట్స్ ఏంటీ? వాటిని ఏఎఎణనీలతినిటతిజీ కు ట్వీట్ చేయాల్సిందిగా ప్రధాని కార్యాలయం శుక్రవారం పేర్కొంది. ప్రధాని కార్యాలయం ఈ ట్వీట్ చేసిన సెకన్ల వ్యవధిలోనే ప్రజలు తమ ఆలోచనలను పోస్టు చేయడం ప్రారంభించారు.

ట్విట్టర్ యూజర్ సుమిత్ మోహతా ట్వీట్ చేస్తూ పాఠశాల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి టీకాలు వేయడానికి ఒక మిషన్ ప్రోగ్రాంను ప్రకటించాలన్నారు. ఇది భవిష్యత్తుకు మీ అతిపెద్ద బహుమతి అవుతుందని పేర్కొన్నారు. మరో ట్విట్టర్ యూజర్ ఆకాష్ సింగ్ స్పందిస్తూ.. జనాభ పెరుగుదల భారత్ అతిపెద్ద సమస్యగా మారుతోంది. రాబోయే కొద్ది సంవత్సరాల్లో దేశ జనాభా 150 కోట్లకు చేరుతుంది. కావునా ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎర్రకోట నుండి జనాభా విస్ఫోటనం గురించి ఏదైనా చెప్పాల్సిందిగా అభ్యర్థించారు.

మరొక ట్విట్టర్ వినియోగదారుడు అనుపమ్ రవి స్పందిస్తూ.. మీరు, మీ క్యాబినెట్ రెగ్యులర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తారని హామీ ఇవ్వగలరా? ద్రవ్యోల్బణం, వస్తువుల ధరలను ఎలా నిర్వహించాలో ప్రభుత్వం యోచిస్తోంది? రిమోట్ విద్యను నిర్వహించడానికి పోస్ట్ కోవిడ్ ప్రపంచంలో ఏటువంటి మౌలిక సదుపాయాలు తీసుకోబడ్డాయి వంటి అంశాలపై ప్రసంగించాల్సిందిగా కోరాడు.

ఈ క్రమంలో చాలా మంది నెటిజన్లు పెగాసస్ సమస్య, రాఫెల్ విచారణ, ఇంధన ధరల పెరుగుదల, వివాదాస్పద వ్యవసాయ చట్టాలపై మాట్లాడాల్సిందిగా అడిగారు. మరో ట్విట్టర్ యూజర్ దీపక్ కుమార్ స్పందిస్తూ.. ద్రవ్యోల్బనం, నిరుద్యోగిత, కొవిడ్ వల్ల భారత్‌లో నాలుగు లక్షల మంది చనిపోవడం, స్లో వ్యాక్సినేషన్, అవినీతి, కొవిడ్ అనంతరం కూలీల జీవితాలపై దయచేసి మాట్లాడాల్సిందిగా కోరారు.

# దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా ఉధృతి..

న్యూఢిల్లీ, జులై 30:దేశంలో కరోనా కేసులు మళ్లీ విజృంభిస్తున్నాయి. తాజాగా 44,230 కరోనా కేసులు నమోద య్యాయని కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అలాగే, 24 గంటల్లో 42,360 మంది కోలుకున్నారు. నిన్న 555 మంది కరోనాతో ప్రాణాలు కోల్పోయారు. దీంతో మృతుల సంఖ్య మొత్తం 4,23,217కు పెరిగింది. దేశంలో కరోనా నుంచి ఇప్పటివరకు 3,07,43,972 మంది కోలుకున్నారు. 4,05,155 మందికి ప్రస్తుతం ఆసుపత్రులు, హోం క్వారంటైన్‌లలో చికిత్స అందుతోంది. ఇప్పటివరకు మొత్తం 45,60,33,754 వ్యాక్సిన్ డోసులు వేశారు. ఇక 45.60 కోట్ల మందికి పైగా కొవిడ్ టీకాలు పంపిణీ చేశారు.

# దేశంలో 48.03 కోట్ల వ్యాక్సిన్ డోసుల పంపిణీ: కేంద్రం

న్యూఢిల్లీ, జులై 30:దేశంలో కొవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతున్నది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వ్యాక్సినేషన్‌కు సరిపడా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు వ్యాక్సిన్‌లను పంపిణీ చేస్తున్నది. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు కేంద్ర సర్కారు.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కలిపి మొత్తం 48 కోట్లకు పైగా (48,03,97,080) వ్యాక్సిన్ డోసులను ( ఎజీఇఇతినివ టనీబవబ ) పంపిణీ చేసిందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. వాటిలో వేస్టేజీతో కలిపి రాష్ట్రాలు 45,27,93,441 డోసులను వినియోగించుకున్నాయని పేర్కొన్నది.

రాష్ట్రాల దగ్గర మరో 2.73 కోట్లకు పైగా డోసులు మిగిలి ఉన్నాయని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ముందుగా నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారమే జులై 31 నాటికి మరో మూడు కోట్ల డోసులను పంపిణీ చేస్తామని, దాంతో దేశంలో పంపిణీ చేసిన మొత్తం డోసుల సంఖ్య 51 కోట్లకు చేరుతుందని తెలిపింది. ఇదిలావుంటే దేశంలో తగ్గినట్టే తగ్గిన రోజువారీ కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతున్నది. ఒక దశలో 30 వేల దిగువకు చేరిన రోజువారీ కేసులు ఇప్పుడు మళ్లీ 45 వేల దగ్గరకు చేరాయి. ఇవాళ కూడా దేశంలో 44,230 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది.

# సిరిసిల్లకు మంచి రోజులు.. అపరెల్ పార్కులో 10 వేల మందికి ఉపాధి : మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, జులై 30:(నేటినిజం ప్రతినిధి): టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సిరిసిల్లకు మంచి రోజులు వచ్చాయి? పెద్దూర్ అపరెల్ పార్కులో 10 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. పెద్దూర్ అపరెల్ పార్కులో గోకల్‌దాస్ ఇమెజెస్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గోకుల్‌దాస్ ఎండీ సుమిర్ హిందూజాతో పాటు పలువురు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. సిరిసిల్లలో అపరెల్ పార్కు ఉండాలనేది ఈ ప్రాంత ప్రజలు ఎప్పట్నుంచో కల కంటు న్నారు. 2005లో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి అపరెల్ పార్కు పెడుతామని మాటిచ్చారు. కానీ అమలు చేయలేదు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఇవాళ దానికి బీజం పడింది. సిరిసిల్ల ప్రజల కల నెరవేరింది. ఈ పార్కులో రాబోయే రోజుల్లో 10 వేల మంది ఉపాధి పొందబోతున్నారు. 80 శాతానికి పైగా మహిళలకే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. బతుకమ్మ చీరలు, గవర్న మెంట్ స్కూల్స్ యూనిఫాం ఆర్డర్లు వస్తున్నాయి. దీంతో నేతన్నల ఆదాయం పెరిగింది అని కేటీఆర్ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ఫ్యాక్టరీలను నెలకొల్పుతున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసే బట్టలు అంతర్జాతీయ మార్కెట్‌కు వెళ్తాయి. అందుకే ఆ స్థాయిలో ఈ ఫ్యాక్టరీలను డెవలప్ చేస్తున్నారని చెప్పారు. ఈ పార్కులో వైద్య సదుపాయాలు కూడా కల్పిస్తామన్నారు. బేబీ కేర్ సెంటర్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ 60 ఎకరాల్లో రాబోయే రోజుల్లో రెండు, మూడు ఫ్యాక్టరీలు వరుసగా రాబోతున్నాయి. రాబోయే 6 నెలల్లో గోకల్‌దాస్ కంపెనీ ప్రారంభం కాబోతుంది అని కేటీఆర్ తెలిపారు. ఈ ఫ్యాక్టరీలో 1000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అత్యధికంగా మహిళలకే ప్రాధాన్యత ఇస్తామని కేటీఆర్ చెప్పారు. అయితే ఇప్పటికే చాలా మంది మహిళలు శిక్షణ కూడా పూర్తి చేసుకున్నట్లు పేర్కొన్నారు.

## పత్తి పండించడంలో తెలంగాణ నంబర్ వన్

భారతదేశంలోనే అత్యధికంగా పత్తి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నంబర్ వన్ స్థానంలో నిలిచింది అని కేటీఆర్ చెప్పారు. అత్యుత్తమైన, నాణ్యత గల పత్తి తెలంగాణలో దొరుకుతుందని సౌత్ ఇండియా మిల్స్ అసోసియేషన్ వారు చెబుతున్నారు. మన పిల్లలకు ఉపాధి అవకాశాలు దక్కాలనే ఆలోచనతో తెలంగాణ టెక్స్ టైల్, అపెరల్ పాలసీని తీసుకొచ్చామన్నారు. ఈ పాలసీలో భాగంగా దేశంలోని ప్రముఖమైన టెక్స్ టైల్ సంస్థలను కలిశాం. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో యంగ్ వన్ అనే సంస్థ 300 ఎకరాల్లో పెట్టుబడులు పెడుతుందన్నారు. దీంతో 12 వేల మందికి ఉపాధి అవకాశాలు రాబోతున్నాయి. కేరళకు చెందిన కిటెక్స్ సంస్థ వెయ్యి కోట్ల పెట్టుబడితో 4 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వరంగల్‌కు తరలివచ్చింది అని కేటీఆర్ గుర్తు చేశారు.

## త్వరలోనే చేనేత బీమా

నేతన్న సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారు అని మంత్రి కేటీఆర్ తెలిపారు. చేనేత బీమా కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ పథకం కింద రూ. 5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. నేతన్నకు చేయూత కార్యక్రమం అమలవుతుందన్నారు. దీని ద్వారా కరోనా కాలంలో 26 వేల కుటుంబాలకు 110 కోట్లు ఇచ్చి ఆదుకున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో మరమగ్గాలు, చేనేత కార్మికులకు రుణమాఫీ చేశామన్నారు. మరమగ్గాల ఆధునీకరణకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడం జరిగింది అని కేటీఆర్ చెప్పారు. పెద్దూర్‌లోనే 88 ఎకరాల్లో రూ. 400 కోట్లు ఖర్చు పెట్టి వర్కర్ టూ ఓనర్ అనే ప్రోగ్రామ్‌కు పనులు జరుగుతున్నాయని తెలిపారు. భారతదేశంలో నేతన్నల సంక్షేమం కోసం ఇంత గొప్ప కార్యక్రమం ఎక్కడా జరగడం లేదన్నారు. పెద్దూర్ అపరెల్ పార్కులో మంచి వాతావరణాన్ని సృష్టించి.. మహిళలకు అన్ని సదుపాయాలు కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది అని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

# సీఎం కేసీఆర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన పెద్దిరెడ్డి

హైదరాబాద్ , జులై 30: బీజేపీకి రాజీనామా చేసిన సీనియర్ నేత, మాజీమంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పెద్దిరెడ్డికి సీఎం కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి వచ్చిన పెద్దిరెడ్డి అనుచరులు, కార్యకర్తలు భారీగా టీఆర్‌ఎస్‌లో చేరారు. నిరుపేద దళితుల, దేవాలయ భూములను ఆక్రమించి, మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన ఈటల రాజేందర్‌ను బీజేపీలో చేర్చుకోవటాన్ని నిరసిస్తూ పెద్దిరెడ్డి ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు.



# కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 8.72 లక్షల పోస్టులు ఖాళీ

న్యూఢిల్లీ, జులై 30: కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 2020 మార్చి 1 నాటికి 8.72 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారు. కేంద్రంలోని అన్ని శాఖల్లో మంజూరైన పోస్టులు గతేడాది మార్చికి 40,04,941గా ఉన్నట్టు తెలిపారు. 2020 మార్చి 1 నాటికి 31,32,698 మంది విధుల్లో ఉన్నట్టు పేర్కొన్నారు. మొత్తం 8,72,243 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఈ మేరకు గురువారం రాజ్యసభలో ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గడిచిన ఐదేండ్లలో మూడు ప్రధాన ఏజెన్సీల ద్వారా కొన్ని నియామకాలు చేపట్టినట్టు తెలిపారు. 2016-17 నుంచి 2020-21 వరకు యూపీఎస్సీ ద్వారా 25,267 పోస్టులు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా 2,14,601 పోస్టులు, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 2,04,945 పోస్టులు భర్తీచేసినట్టు ఆయన వెల్లడించారు. రిజర్వేషన్ క్యాటగిరీలవారీగా ఎస్సీ విభాగంలో 14,366, ఎస్టీలో 12,612, ఓబీసీలో 15,088 బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు వివరించారు.

తాము అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని 2014లో ప్రధాని మోదీ ప్రకటించారు. వాస్తవానికి ఆ పరిస్థితులు కనబడటంలేదు. కేంద్రప్రభుత్వంలోని వివిధ శాఖల్లో భర్తీచేయని పోస్టుల సంఖ్య గత ఐదేండ్లలో రెట్టింపు అయింది. కేంద్ర ఆర్థిక శాఖ కింద పనిచేసే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 2014-15 ఆర్థిక సంవత్సరంలో మంజూరైనప్పటికీ కేంద్రప్రభుత్వ శాఖల్లో భర్తీచేయని పోస్టులు 11.57 శాతంగా (4,21,658 పోస్టులు) ఉంటే, 2019-20 నాటికి 21.77 శాతానికి (8,72,243 పోస్టులు) చేరింది. కేంద్రవిశ్వవిద్యాలయాలు, ఐఐటీ/ఐఐఎం, కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఉన్నతవిద్యా సంస్థల్లో దాదాపు 37 వేల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు సమాచారం.

# ఏం సాధించావని కాళ్లు కడిగించుకున్నవ్ : ఎమ్మెల్యే దానం నాగేందర్

హైదరాబాద్ , జులై 30: హుజూరాబాద్‌లో దళితుల చేత బీజేపీ నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్ కాళ్లు కడిగించుకోవడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నగరంలోని బంజారాహిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దళితులకు అండగా నిలబడేందుకు సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశ పెడితే ఈటల రాజేందర్‌తో పాటు ఆయన పార్టీ నేతలు అడ్డుకునే కుట్రలు చేస్తున్నారన్నారు. ఏం సాధించారని కాళ్లు కడిగించుకుంటున్నవని ప్రశ్నించారు. ఒకవైపు ఈటల బామ్మర్ది దళితులను కించపరుస్తూ మాట్లాడతాడు.. మరోవైపు దళిత బంధుని అడ్డుకునేందుకు ఈటల కుట్రలు చేస్తారు. ఇదేనా మీ దళిత ప్రేమ. దళితులతో కళ్ళు కడిగించుకోవడం సిగ్గు చేటు అన్నారు.

వెంటనే తెలంగాణ ప్రజలకు, దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దళిత బంధు కేవలం హుజూరాబాద్ నియోజక వర్గానికే కాదు. రాష్ట్రం మెత్తంలోని దళితుల అభివృద్ధి కోసం అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా దాన్ని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు దిగజారుడు కుట్రలు చేయడం అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. కుట్రలను ఛేదించి అభివృద్ధి సాధించడం సీఎం కేసీఆర్‌కు అలవాటేనని దానం పేర్కొన్నారు.

# దేశంలో 70 డెల్టా ప్లస్ కేసులు.. తెలంగాణాలో రెండు: కేంద్రం

న్యూఢిల్లీ, జులై 30:దేశవ్యాప్తంగా 70 డెల్టా ప్లస్ వేరియంట్ కేసులను గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇందులో రెండు కేసులను తెలంగాణాలో కనుగొన్నట్లు పేర్కొంది. శుక్రవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో భాగంగా కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ ఈ మేరకు వెల్లడించారు. దేశంలో ాంఖీూ-అనీూ-2 యొక్క జన్యు శ్రేణిని పర్యవేక్షించే ఇండియన్ ాంఖీూ-అనీూ-2 జెనోమిక్స్ కన్సార్టియం (ఎూంఅూఉ) ఈ మేరకు గుర్తించినట్లు తెలిపారు.దేశంలోని 28 ప్రయోగశాలల్లో కరోనా వేరియంట్లకు సంబంధించిన 58,240 నమూనాలను ఎూంఅూఉ పరీక్షించినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. వీటిలో 46,124 నమూనాలను జన్యుపరంగా విశ్లేషించినట్లు వివరించారు. 4172 నమూనాలు ఆల్ఫా వేరియంట్, 217 నమూనాలు బీటా వేరియంట్, ఒక నమూనా గామా వేరియంట్, 17,169 నమూనాలు డెల్టా వేరియంట్, 70 డెల్టా ప్లస్ వేరియంట్లను గుర్తించినట్లు వెల్లడించారు.

# అల్లోపతిపై వివాదాస్పద వ్యాఖ్యలు : రాందేవ్ బాబాకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, జులై 30: అల్లోపతి వైద్యంతో పాటు అల్లోపతి డాక్టర్లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన యోగా గురు రాందేవ్ బాబాకు ఢిల్ల హైకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఆగస్ట్ 10లోగా నోటీసులకు బదులివ్వాలని ఆయనను హైకోర్టు ఆదేశించింది. లాభాలు దండుకోవాలనే ఉద్దేశంతో రాందేవ్ బాబా ఆధునిక వైద్యంపై దుష్ప్రచారం చేశారని ఆరోపిస్తూ ఏడుగురు వైద్యులు దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఆయనకు నోటీసులు జారీ చేసింది.

కరోనా వైరస్ చికిత్సలో ఉపయోగించే కొన్ని ఔషధాలను ప్రశ్నిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలతో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రాందేవ్ బాబాపై విమర్శలు వెల్లువెత్తాయి. అల్లోపతి మెడిసిన్ వాడిన లక్షలాది కరోనా రోగులు మృత్యువాత పడ్డారని ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి.

దేశవ్యాప్తంగా వైద్యుల సంఘాలు ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ రాందేవ్‌పై పలుచోట్ల ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేశాయి. ఐఎంఏ ఆయనపై రూ వేయికోట్లకు పరువు నష్టం దావా వేసింది.



## చరిత్రలో నేటినిజం



కం॥ ఆంగ్లసకము తేకుండగ
మాతృభూమి నెత్తురు చిందగ, మనదేశముపై
యా ధృశ్యము చూపిన - సమ
రోత్సాహి గొలువ చుండి 'ఉద్దాంసింగ్' !!

(జులై 31 దేశభక్తుడు ఉద్దాంసింగ్ ఉరితీత) -రాధశ్రీ



సెల్: 9494481210

# వర్సిటీ అభివృద్ధి రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించిన ఉస్మానియా

హైదరాబాద్ , జులై 30:ఉస్మానియా విశ్వవిద్యాలయం రాబోయే మూడేళ్లపాటు వర్సిటీ అభివృద్ధి కోసం తన 21 పాయింట్ల రోడ్ మ్యాప్‌ను శుక్రవారం ఆవిష్కరించింది. సివిల్ సర్వీసెస్ అకాడమిని స్థాపించడం, అకడమిక్ ప్రోగ్రామ్‌లను రివైజ్ చేయడం, ఆన్‌లైన్-లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేయడం వంటివి వీటిలో కొన్ని. ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. రవీందర్ యాదవ్ మాట్లాడుతూ శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థి కేంద్రం నూతన జాబ్ ఓరియెంటెడ్ యూజీ, పీజీ కోర్సులు ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్‌లను సృష్టించడంతో పాటు ఎక్సలెన్స్ పాఠశాలలను స్థాపించాలని విశ్వవిద్యాలయం యోచిస్తోన్నట్లు వీసీ పేర్కొన్నారు.

# కుమ్మరి సంఘం ప్రతిపాదనలకు మంత్రి గంగుల కమలాకర్ సానుకూల స్పందన

హైదరాబాద్ , జులై 30:హుజురాబాద్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా కుమ్మరి వృత్తిదారులకు ఆధునిక ఎలక్ట్రికల్ పాటరీ వీల్స్ యంత్రాల పంపిణీ చేపట్టాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే కుమ్మరి యువతకు ఆధునిక శిక్షణ ఇప్పించిన సీఎం కేసీఆర్‌కు కుమ్మరి సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో రాష్ట్రంలోని 3,500 మంది కుమ్మరి వృత్తిదారులకు ప్రభుత్వం ఆధునిక శిక్షణ ఇప్పించింది. ఈ శిక్షణ ద్వారా ఆధునిక యంత్రాలపై మంచి అవగాహన లభించింది. దాంతో మట్టి గణపతులు, వాటర్ బాటిళ్లు వంటి వస్తువుల తయారీని చేపట్టి ఉపాధి పొందుతున్నట్లు సంఘం ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.



ఆధునిక పాటరీ వీల్స్ కోసం 20 శాతం డీడీల రూపంలో కడితే 80 శాతం సబ్సిడీతో లక్ష రూపాయల విలువగల యంత్రాల్ని ప్రభుత్వం అందిస్తుందని, అందుకోసం దాదాపు 320 మంది రాష్ట్రవ్యాప్తంగా కుమ్మరి వృత్తిదారులు డీడీలు కట్టారన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో డీడీలు కట్టిన వారికి యంత్రాల్ని అందిస్తూ పైలట్ ప్రాజెక్టుగా కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని సంఘం ప్రతినిధులు మంత్రిని కోరారు. అదేవిధంగా ఇంకా డీడీలు కట్టడానికి సైతం అవకాశం కల్పించాలన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ బీసీ సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తమ సమస్యలపై తక్షణమే స్పందిస్తూ ఆదేశాలు జారీ చేసిన మంత్రికి రాష్ట్ర కుమ్మరి సంఘం ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమలో తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షులు కుమ్మరి బాల కృష్ణ ప్రజాపతి, ఉపాధ్యక్షులు ఉరిటి వెంకట్రావు ప్రజాపతి, ప్రధాన కార్యదర్శి పావని ప్రజాపతి, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్య క్షురాలు కొండవీటి ప్రణీత రాణి ప్రజాపతి, సంయుక్త కార్యదర్శి దూగుంట్ల నరేష్ ప్రజాపతి, ప్రచార కార్యదర్శి నాగపురి భాస్కర్ ప్రజాపతి, జూబ్లీహిల్స్ నియో జకవర్గ అధ్యక్షులు ఎస్ బి రాములు ప్రజా పతి, కుమ్మరి యాదగిరి ప్రజాపతి, ఎన్. మల్లికార్జున్ ప్రజాపతి, శిక్షణ పొందిన వృత్తి దారులు కుమ్మరి కృష్ణ ప్రజాపతి, కుమ్మరి బాలకృష్ణ ప్రజాపతి, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు సముచిత స్థానం : మంత్రి కొప్పుల

హైదరాబాద్ , జులై 30: ఉద్యమంలో చురుగ్గా వ్యవహరించిన, పార్టీ కోసం కష్టపడే వారికి తప్పక గుర్తింపు ఉంటుందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దీనికి ఉదాహరణ బండా శ్రీనివాస్ నియమాకమేనని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన శ్రీనివాస్ శుక్రవారం మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ తదితరులు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించే వారందరిని గుర్తు పెట్టుకున్నారని, సమయం వచ్చినప్పుడు సముచిత స్థానం కల్పిస్తారన్నారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ప్రజలందరి భద్రత, సంక్షేమం, అభ్యున్నతికి అంకితభావంతో ముందుకు సాగుతున్నారన్నారు.

అలాగే మాజీ మంత్రి ఇ.పెద్దిరెడ్డి, టిఆర్ఎస్ నాయకులు సమ్మిరెడ్డి, అక్బర్ హుస్సేన్, కృష్ణమోహన్ రావు, పొనుగంటి మల్లయ్య, గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండీ కరుణాకర్, జీఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికి రేషన్ కార్డులు : ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి




జోగులాంబ గద్వాల, జులై 30: అర్హులందరికి రేషన్ కార్డుల పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్దిదారులకు రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలకు అండగా తెలంగాణ ప్రభుత్వం ఉంటుందన్నారు. అనంతరం కలెక్టరేట్ సమీపంలో 25 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీపీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సరోజమ్మ, పురపాలక చైర్మన్ కేశవ్, వైస్ చైర్మన్ బాబర్, ఎంపీపీ ప్రతాప్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# హాలియాలో సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి జగదీశ్ రెడ్డి

నల్లగొండ, జులై 30:: జిల్లాలోని నాగార్జున సాగర్ నియోజకవర్గం హాలియాకు సీఎం కేసీఆర్ ఆగస్టు 2న సీఎం కేసీఆర్ విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్ రెడ్డి గురువారం పరిశీలించారు. నియోజకవర్గ ప్రగతి సమీక్ష నిర్వహించేందుకు, సమావేశ నిర్వహణకు ప్రభుత్వ ఐ.టి.ఐ., మార్కెట్ యార్డ్ ను స్థానిక ఎమ్మెల్యే నోముల భగత్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డి.ఐ.జి. ఏ.వి.రంగనాథ్, అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన సభ ఉప ఎన్నిక సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి హాలియాకు విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హామీల అమలు, నియోజక వర్గం ప్రగతి సమీక్షను సీఎం నిర్వహిస్తారన్నారు. నియోజక వర్గంలో సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, దీర్ఘకాలిక సమస్యలుపై వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలు, అధికారులతో సీఎం సమిక్షించి సలహాలు, సూచనలు, దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు.



## ప్రజా ఉద్యమంగా 'ఫిట్ ఇండియా' కార్యక్రమం అమలు: శ్రీ అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, జులై 30: ఫిట్ ఇండియా'(శరీర సౌష్టవం) కార్యక్రమం కింద సంబంధిత వర్గాలతో కలిసి వివిధ కార్యకలాపాలు మరియు ప్రచారాల ద్వారా శరీర సౌష్టవం (ఫిట్ నెస్ ) పై మంత్రిత్వ శాఖ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్ విధానాల్లో మంత్రిత్వ శాఖ లాక్ డౌన్ సమయంలో ఫ్లగ్ రన్, స్కూల్ సర్టిఫికేషన్ సిస్టమ్, యూత్ క్లబ్ సర్టిఫికేషన్ సిస్టమ్, స్కూల్ వీక్ వేడుకలు, సైక్లోథాన్, యోగా డే వేడుక, ఫ్రీడమ్ రన్, యాక్టివ్ డే సిరీస్ లాంటి కార్యక్రమాలను ప్రారంభించింది. మంత్రిత్వ శాఖ ఛాంపియన్ టాక్స్, డైలాగ్ సిరీస్, ఇండిజీనస్ గేమ్స్ సిరీస్, ఫిట్ ఇండియా థిమాటిక్ క్యాంపెయిన్, మరియు ప్రభాత్ ఫెరిస్ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నది. వివిధ వయసుల వారికి వారి వయస్సుకి తగిన ఫిట్‌నెస్ కార్యక్రమాలు ఫిట్ ఇండియా కింద ప్రవేశపెట్టబడ్డాయి.

భారతీయ సంస్కృతిలో ఎల్లప్పుడూ అంతర్భాగంగా ఉన్న సాధారణ శారీరక శ్రమల ప్రాధాన్యతను వివరిస్తూ ఫిట్ ఇండియా కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి అవగాహనా కార్యక్రమాలను మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్నది. ఫిట్ ఇండియా కార్యక్రమం కింద నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలు / కార్యకలాపాల్లో పాల్గొవాలని కార్పొరేట్ సంస్థలను ఆహ్వానించడం జరుగుతున్నది. ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్, ఫిట్ ఇండియా సైక్లోథాన్ మొదలైన కార్యక్రమాల నిర్వహణలో కార్పొరేట్ సంస్థల నుంచి మంచి స్పందన లభించింది.

ఫిట్ ఇండియాను ప్రజల ఉద్యమంగా మార్చడంలో కేంద్ర ప్రభుత్వ పాత్ర స్ఫూర్తిని ఇవ్వడానికి మాత్రమే పరిమితం అయ్యింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక నిధులు కేటాయించబడలేదు.

## తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల దత్తత

న్యూఢిల్లీ, జులై 30:జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ) చట్టం, 2015 (జెజె చట్టం) లోని నిబంధనల ప్రకారం సమస్యల్లో ఉన్న పిల్లలు మెరిట్ కేర్ అండ్ ప్రొటెక్షన్ చూడవచ్చు. దత్తతతో పాటు సంస్థాగత మరియు సంస్థేతర సంరక్షణ ద్వారా అటువంటి పిల్లల పునరావాసం కోసం ఈ చట్టం విధానాన్ని రూపొందించింది. జేజే చట్టం, 2015 కింద పిల్లల దత్తత చైల్డ్ అడాప్షన్ రిసోర్స్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ సిస్టమ్ (కేరింగ్స్) ద్వారా జరుగుతుంది. ఇది వెబ్ ఆధారిత అప్లికేషన్ మరియు దత్తత తీసుకున్న తల్లిదండ్రులను వారి సీనియారిటీ ఆధారంగా పిల్లలను సూచిస్తారు. ఇది వారి నమోదు తేదీ ప్రకారం నిర్ణయించబడుతుంది. కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) దత్తత ప్రక్రియను సులభతరం చేయడానికి అనేక చర్యలు తీసుకుంది. ప్రాస్పెక్టివ్ అడాప్టివ్ పేరెంట్స్ (పిఎపి) యొక్క తాత్కాలిక రిజిస్ట్రేషన్ మరియు అన్ని రిజిస్ట్రార్ జనరల్లను దత్తత కేసులను ప్రాధాన్యతపై తీసుకోవటానికి మరియు సులభతరం చేయడానికి అభ్యర్థించడం వంటివి చేపట్టింది. దత్తత కేసులను వేగవంతం చేయడానికి వర్చువల్ కోర్టు విచారణలు ఏర్పాటు చేశారు.

కొవిడ్-19 మహమ్మారి కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన లేదా జీవించి ఉన్న తల్లిదండ్రులు లేదా చట్టపరమైన సంరక్షకులు లేదా దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు మద్దతు ఇవ్వడానికి పిల్లల పథకం కోసం గౌరవ ప్రధాని పిఎం కేర్స్‌ను ప్రకటించారు.

ఈ పథకం విద్య మరియు ఆరోగ్యానికి తోడ్పడుతుంది. అలాగే అతను లేదా ఆమె 18 ఏళ్ళకు చేరుకున్నప్పుడు రూ .10 లక్షల కార్పస్ సృష్టిస్తుంది. ఈ కార్పస్ 18 సంవత్సరాల వయస్సు గల నెలవారీ ఆర్థిక సహాయం / స్టైపెండ్ ఫారమ్ ఇవ్వడానికి ఉపయోగించబడుతుంది. రాబోయే 5 సంవత్సరాలు ఉన్నత విద్య కాలంలో మరియు అతని వ్యక్తిగత అవసరాలను జాగ్రత్తగా చూసుకోవటానికి మరియు 23 సంవత్సరాల వయస్సు చేరుకున్నప్పుడు అతను లేదా ఆమె కార్పస్ మొత్తాన్ని వ్యక్తిగత మరియు వృత్తిపరమైన ఉపయోగం కోసం ఒక మొత్తంగా పొందుతుంది. ఈ పథకాన్ని జూఎఞజీతీవబటనీతీఞప్రతిశ్రీటతీవని.తిని. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పొందవచ్చు. ఈ పోర్టల్ అన్ని రాష్ట్రాలు మరియు యుటిల కోసం 15.07.21 న ప్రవేశపెట్టబడింది. ఈ పథకం కింద మద్దతు కోసం అర్హత ఉన్న పిల్లల గురించి ఏదైనా పౌరుడు పోర్టల్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయవచ్చు.

అలాగే చైల్డ్ ప్రొటెక్షన్ సర్వీసెస్ స్కీమ్ కింద నిధులు సమకూర్చుకుంటూ జెజె చట్టం మరియు దానిలోని నిబంధనల ప్రకారం కొవిడ్ 19 ద్వారా ప్రభావితమైన పిల్లల సంరక్షణ మరియు రక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు మరియు యుటిలను కోరింది.

జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ) సవరణ బిల్లు 2021తో దత్తత ప్రక్రియను సరళీకృతం చేయడానికి అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌తో సహా జిల్లా మేజిస్ట్రేట్‌కు అధికారం ఇవ్వడం ద్వారా దత్తత ప్రక్రియను పూర్తి చేయడానికి జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ) చట్టం, 2015 ప్రకారం పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించాయి.

## భారత దేశపు మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ ఇంధన స్టేషన్‌ను లేహ్ నగరంలో ఏర్పాటుకు చేసేందుకు టెండర్లు ఆహ్వానించిన ఎన్‌టీపీసీ

న్యూఢిల్లీ, జులై 30:ఎన్‌టీపీసీ యాజమాన్యంలోని అనుబంధ సంస్థ 'నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్' (ఎన్‌టీపీసీ ఆర్‌ఈఎల్) లద్దాఖ్‌లోని లేహ్ నగరంలో భారతలోనే మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ ఇంధన స్టేషన్‌ను ఏర్పాటు చేయడానికి దేశీయ టెండర్లున ఆహ్వానించింది. ఈ

బిడ్ పత్రాల అమ్మకం జూలై 31, 2021 నుండి ప్రారంభమవుతుంది. ఇటీవల ఎన్‌టీపీసీ విద్యుత్ వ్యాపర్ నిగమ్ లిమిటెడ్ లడఖ్‌లో ఇంధన సెల్ బస్సుల సేకరణ కోసం (ఎన్‌వీవీఎన్) ఇచ్చిన టెండర్‌కు కొనసాగింపుగా ఈ కొత్త టెండర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఎన్‌టీపీసీ ఆర్‌ఈఎల్, ఎన్‌వీవీఎన్‌లు సంయుక్తంగా గ్రీన్ మొబిలిటీ ప్రాజెక్టును లడఖ్ నగరంలో అమలు చేయనున్నాయి. పూర్తిగా హరిత విధానంలో హైడ్రోజన్ ఫ్యూయలింగ్ స్టేషన్ ఏర్పాటుకు గాను ఎన్‌టీపీసీ ఆర్‌ఈఎల్ 1.25 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను లేహ్‌లో ఏర్పాటు చేస్తోంది. సోలార్ ప్లాంట్ కాంట్రాక్టు నెలలోపు ఇవ్వబడుతుంది. ఎత్తైన ప్రాంతంలో హరిత హైడ్రోజన్ టెక్నాలజీల అభివృద్ధి కోసం ఎన్‌టీపీసీ ఆర్‌ఈఎల్ గతంలో కేంద్ర పాలిత ప్రాంతం లడఖ్‌తో ఒక మైలురాయి లాంటి అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తయితే లేహ్ మరియు పరిసరాల్లో ఉద్గార రహిత రవాణా వ్యవస్థకు గాను కొత్త శకానికి దారితీస్తుంది మరియు ఇంతటి గౌరవనీయమైన స్థలంలో ముందడుగు వేసిన కొద్ది దేశాలలో భారత్ కూడా నిలుస్తుంది.

ఈ ప్రాంతంలో ఒక స్పష్టమైన, పచ్చటి పర్యావరణ వ్యవస్థను నిర్మించటానికి ఈ ప్రాజెక్ట్ ఒక నిర్దిష్టమైన ముందడుగుగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్టు విజయవంతంగా అమలు చేయడం వల్లకేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో యొక్క ఉపరితల రవాణా సమస్యలు కూడా తేలికవుతాయి. ఈ ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధికి కూడా ఇది గొప్ప ఉత్తేజాన్ని అందిస్తుంది.

# పవన శక్తి ద్వారా జరిగే విద్యుత్ ఉత్పత్తిలో వినియోగించే వస్తు సామగ్రిలో 70 శాతానికి పైగా భారత్‌లోనే తయారీ

న్యూఢిల్లీ, జులై 30:అనుమతి ఉన్న మోడళ్ళు, తయారీదారుల జాబితాను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ జాబితాలో ఉన్న తయారీదారులే పవన శక్తి విద్యుత్ ప్రాజెక్టుల స్థాపించడానికి అనుమతి ఉంటుంది. 70 శాతానికి పైగా పరికరాలు భారత్ లోనే తయారవుతున్నాయి. దేశంలో పవన శక్తితో సహా పునరుత్పాదక ఇంధన శక్తిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది.

ఆటోమేటిక్ రూట్ కింద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) 100 శాతం వరకు అనుమతిస్తోంది, 2025 జూన్ 30 లోగా ప్రారంభించాల్సిన ప్రాజెక్టుల కోసం సౌర, పవన విద్యుత్తును అంతర్-రాష్ట్ర అమ్మకం కోసం ఇంటర్ స్టేట్ ట్రాన్స్మిషన్ సిస్టమ్ (ఐఎస్టిఎస్) చార్జీల రద్దు, 2022 సంవత్సరం వరకు పునరుత్పాదక కొనుగోలు బాధ్యత (ఆర్పీఓ) కోసం ట్రాజెక్టరీ ప్రకటన, ఫ్లగ్ అండ్ ప్లే ప్రాతిపదికన ఆర్‌ఈ డెవలపర్‌లకు భూమి, ట్రాన్స్మిషన్ అందించడానికి అల్ట్రా మెగా రెన్యూవబుల్ ఎనర్జీ పార్క్‌లను ఏర్పాటు చేయడం,

కొత్త ప్రసార మార్గాలను వేయడం, పునరుత్పాదక శక్తిని పూర్తి స్థాయిలో వినియోగించడానికి కొత్త సబ్ -స్టేషన్ సామర్థ్యాన్ని అందుబాటులోకి తేవడం,

పెట్టుబడులను ఆకర్షించడానికి మరియు సులభతరం చేయడానికి ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ సెల్ ఏర్పాటు, గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ పివి మరియు విండ్ ప్రాజెక్టుల నుండి విద్యుత్ సేకరణ కోసం టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్ ప్రక్రియ కోసం ప్రామాణిక బిడ్డింగ్ మార్గదర్శకాలు.

ఆర్‌ఈ జనరేటర్లకు పంపిణీ లైసెన్సుల ద్వారా సకాలంలో చెల్లింపును నిర్ధారించడానికి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్సీ) లేదా ముందస్తు చెల్లింపుల మేరకు విద్యుత్ విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఆర్‌ఈ ప్రాజెక్టుల అమలు, ఆపరేషన్ మరియు నిర్వహణ కోసం నైపుణ్యం కలిగిన సిబ్బందిని అందుబాటులోకి తేవడానికి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం.

పై వాటితో పాటు, పవన శక్తిని ప్రోత్సహించడానికి ఈ క్రింది చర్యలు ప్రత్యేకంగా తీసుకుంటున్నారు:

పవన విద్యుత్ జనరేటర్ల తయారీకి అవసరమైన కొన్ని భాగాలపై రాయితీలో కస్టమ్ డ్యూటీ మినహాయింపు.

31 మార్చి 2017 న లేదా అంతకు ముందు ప్రారంభించిన పవన ప్రాజెక్టులకు జనరేషన్ ఆధారిత ప్రోత్సాహకం (జిబిఐ) అందిస్తారు.

చెన్నైలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ ద్వారా పవనశక్తి వనరుల అంచనా, సంభావ్య సైట్ల గుర్తింపుతో సహా సాంకేతిక మద్దతు.

పవన వనరు అత్యంత ప్రత్యేకమైనది, దాని వాణిజ్యపరంగా వెలికి తీసే సామర్థ్యం ఏడు రాష్ట్రాల్లో మాత్రమే అందుబాటులో ఉంది, అవి: ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక. ప్రాజెక్ట్ సాంకేతిక-ఆర్థిక సాధ్యత ఆధారంగా ప్రైవేట్ డెవలపర్లు పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తారు.

20,000 మెగావాట్ల సంచిత సామర్థ్యం కలిగిన పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి టెండర్లను దేశంలోని వివిధ కేంద్ర, రాష్ట్ర సంస్థలు ఆహ్వానించాయి, వీటిలో 14,332 మెగావాట్ల ప్రాజెక్టులకు అనుమతి లభించింది. 30.06.2021 నాటికి దేశంలో 39,486 మెగావాట్ల సామర్థ్యం గల పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు

# కోవిడ్ మహమ్మారి సమయంలో మూతపడిన స్టార్టప్‌లు, చిన్న కంపెనీలపై అధ్యయనం..

న్యూఢిల్లీ, జులై 30:కోవిడ్ -19 మహమ్మారి దేశంలోని వివిధ చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్‌పై ప్రభావాన్ని చూపింది. ప్రభుత్వం లాక్‌డౌన్‌ను ఖచ్చితంగా అమలు చేయడంతో ఆర్థిక కార్యకలాపాలు తగ్గాయి. ఎం.ఎస్.ఎం.ఇలపై కూడా దీని ప్రభావం పడింది.

కోవిడ్ -19 ప్రభావం ఎం.ఎస్.ఎం.ఇల మీద అలాగే ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద (పిఎంఇజిపి) చేపట్టిన యూనిట్లపైన ఏమేరకు ఉందనేదానిని అంచనా వేసేందుకు నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్.ఎస్.ఐ.సి), విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (ఎస్ వి.ఐ.సి)లు అధ్యయనాలు నిర్వహించాయి.

ఎన్.ఎస్.ఐ.సి ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఈ అధ్యయనం ,ఆయా సంస్థల నిర్వహణ సామర్థ్యం, ఎన్ఎస్ఐసి పథకాల లబ్ధిదారులు ఎదుర్కొన్న ఇబ్బందులు,కోవిడ్ -19 మహమ్మారి తదితర అంశాలపై ప్రధానంగా కింది అంశాలు వెల్లడించింది.

1) 91 శాతం ఎం.ఎస్.ఎం.ఇలు కార్యకలాపాలు నిర్వహించే దశలో ఉన్నాయి.

2) చాలావరకు ఎం.ఎస్.ఎం.ఇలు ఎదుర్కొంటున్న సమస్యలలో లిక్విడిటి (55 శాతం యూనిట్లు ఈ సమస్య ఎదుర్కొంటున్నాయి.)., తాజా ఆర్డర్లు (17 శాతం యూనిట్లు),లేబర్ 9 శాతం యూనిట్లు ,లాజిస్టిక్‌లు 12 శాతం యూనిట్లు , ముడిసరుకు లభ్యత (8 శాతం యూనిట్లు) ఉన్నాయి.

కెవిఐసి నిర్వహించిన అధ్యయనం లో ఈ కింది అంశాలు వెల్లడి అయ్యాయి.

1) పిఎంఇజిపి పథకం కింద లబ్ధిదారులలో 88 శాతం మంది కోవిడ్ 19 తమపై వ్యతిరేక ప్రభావం చూపిందని చెప్పగా 12 శాతంమంది కోవిడ్ 19 మహమ్మారి వల్ల తాము లబ్ధిపొందామని చెప్పారు.

2) కోవిడ్ ప్రభావం పడిన 88 శాతం మందిలో 57 శాతం మంది తమ యూనిట్లను లాక్‌డౌన్ సమయంలో కొంతకాలం మూసివేసినట్టు చెప్పగా , 30 శాతం మంది తమ ఆదాయం, రాబడి తగ్గినట్టుతెలిపారు.

3) కోవిడ్ -19 వల్ల తమ వ్యాపార కార్యకలాపాల విషయంలో ప్రయోజనం పొందినవారిలో 65 శాతం మంది, తమ సంస్థలు, ఆరోగ్యం, రిటైల్ వ్యాపార రంగంలో ఉన్నందువల్ల తమ వ్యాపార కార్యకలాపాలు పెరిగాయన్నారు. 25 శాతం మంది తమ వ్యాపారాలు నిత్యావసర సరకులతో సంబంధం కలిగినవి అయినందువల్ల ప్రయోజనం పొందినట్టు తెలిపారు.

4) ఉద్యోగులకు రెగ్యులర్ వేతనాల విషయంలో 46.60 శాతం మంది పూర్తి జీతాలు చెల్లించినట్టు చెప్పారు, 42.54 శాతం మంది పాక్షికంగా చెల్లించినట్టు చెప్పారు. 10.86 శాతం మంది కోవిడ్ సమయంలో కొద్ది కాలానికి జీతాలు చెల్లించలేకపోయినట్టు తెలిపాచ.

5) మెజారిటీ లబ్ధిదారులు అదనపు ఆర్థిక సహాయం అవసరాన్ని గురించి, వడ్డీ మాఫీ, తమ ఉత్పత్తులకు మార్కెటింగ్ మద్దతు గురించి తెలియజేశారు.

దేశంలో ఎం.ఎస్.ఎం.ఇ రంగం అభివృద్ధికి, ప్రగతికి ఎం.ఎస్.ఎం.ఇ మంత్రిత్వశాఖ వివిధ పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నది. ఈ పథకాలు, కార్యక్రమాలలో ప్రైమ్ మినిస్టర్స్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం )పిఎంఇజిపి, స్కీమ్ ఆఫ్ ఫండ్ ఫర్ రీ జనరేషన్ ఆఫ్ ట్రెడిషనల్ ఇండస్ట్రీస్ (ఎస్.ఎఫ్.యు.ఆర్.టి.ఐ), గ్రామీణ పరిశ్రమలు , ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ (ఎఎస్‌పిఐఆర్‌ఇ), ఇంట్రస్ట్ సబ్‌వెర్షన్ స్కీమ్ ఫర్ ఇంక్రిమెంటల్ క్రెడిట్ టు ఎం.ఎస్.ఎం.ఇ, సూక్ష్మ, చిన్న ఎంటర్‌ప్రైజ్‌లకు క్రెడిట్ గ్యారంటీ పథకం,

సూక్ష్మ, చిన్న ఎంటర్‌ప్రైజ్‌ల క్లస్టర్ డవలప్‌మెంట్ కార్యక్రమం (ఎం.ఎస్.ఇ-సిడిపి), క్రెడిట్ లింక్‌డ్ కాపిటల్ సబ్సిడీలీ టెక్నాలజీ అప్‌గ్రెడేషన్ స్కీమ్ (సిఎల్‌సిఎస్-టియుఎస్) వంటివి ఉన్నాయి.

కోవిడ్-19 అనంతర కాలంలో , భారత ప్రభుత్వం ఆత్మనిర్భర భారత్ అభియాన్ కింద దేశంలో ఎం.ఎస్.ఎం.ఇ రంగానికి మద్దతునిచ్చేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. అందులో కొన్ని......

1) ఎం.ఎస్.ఎం.ఇలకు రూ 20,000 కోట్ల రూపాయల వరకు సబార్డినేట్ రుణం.

2)ఎం.ఎస్.ఎం.ఇలతో సహా వివిధ వ్యాపారాలకు 3 లక్షల కోట్ల రూపాయల వరకు హామీ లేనిఆటోమేటిక్ రుణాలు

3) ఎం.ఎస్.ఎం.ఇ ఫండ్ ఆఫ్ ఫండ్స్ ద్వారా 50,000 కోట్ల రూపాయల మేరకు ఈక్విటీ ఏర్పాటు

4) ఎం.ఎస్.ఎం.ఇకి సంబంధించి సవరించిన నూతన వర్గీకరణ

5) సులభతర వ్యాపారం కోసం ఉదయం రిజిస్ట్రేషన్ ద్వారా ఎం.ఎస్.ఎం.ఇల కు కొత్తగా రిజిస్ట్రేషన్

6) 200 కోట్ల రూపాయల విలువగల వస్తువలు,సరకు సేకరణకు గ్లోబల్ టెండర్లను విలవరు. ఇది ఎం.ఎన్.ఎం.ఇలకు సాయపడుతుంది.

ఆన్‌లైన్ పోర్టల్ ఛాంపియన్స్‌ను ప్రధానమంత్రి 01-06-2020న ప్రారంభించారు. ఇందులో ఎన్నో అంశాలు ఇమిడి ఉన్నాయి. ఈ గవర్నెన్స్‌తోపాటు, ఎం.ఎస్.ఎం.ఇలకు బాసటగా నిలవడం, ఫిర్యాదుల పరిష్కారం వంటివి ఉన్నాయి.

# ఏపీ సీఎం జగన్ బెయిల్ రద్దు.. ఆగస్ట్ 25న కోర్టు తీర్పు!

అమరావతి, జులై 30:ఏపీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సీబీఐ కోర్టు ఆగస్ట్ 25కు వాయిదా వేసింది. కేసుకు సంబంధించి శుక్రవారం సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. కోర్టు విచక్షణ అధికారులకే నిర్ణయం వదిలేసామంటూ దాఖలు చేసిన మెమోను పరిగణలోకి తీసుకోవాలంటూ కోర్టును సీబీఐ కోరింది. కాగా ఇప్పటికే జగన్ తరపు న్యాయవాదులు, పిటిషనర్ రఘురామకృష్ణం రాజు లాయర్లు లిఖితపూర్వకమైన వాదనలు కోర్టుకు సమర్పించారు. ఈ మూడింటిని పరిగణలోకి తీసుకున్న అనంతరం ఆగస్ట్ 25న కోర్టు తీర్పును వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.గతంలో జగన్, పిటిషనర్ తరపు న్యాయవాదులు రిజైండర్ వేసినప్పటికీ సీబీఐ అధికారులు మాత్రం కేవలం కోర్టు విచక్షణ అధికారులకే నిర్ణయం వదిలేస్తున్నామంటూ దాఖలు చేసిన మెమోను పరిగణలోకి తీసుకోవాలని కౌంటర్‌లో పేర్కొన్నారు. అదే విషయాన్ని ఆన్ రికార్డుల్లోకి తీసుకోవాలని ఈరోజు సీబీఐ తరపు న్యాయవాదలు వాదనలు వినిపించారు. ఈ క్రమంలో కేసు సంబంధించి ఆగస్ట్ 25న కోర్టు తీర్పును వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం

## దేవినేని ఉమ బెయిల్ పిటిషన్ విచారణ సోమవారానికి వాయిదా

అమరావతి, జులై 30:టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమ బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం నాడు ఏపీ హైకోర్టులో వాదనలు జరిగాయి. ఉమపై జి.కొండూరు పోలీసు స్టేషన్‌లో అక్రమ కేసులు నమోదయ్యాయని ఉమ తరపు న్యాయవాదులు హైకోర్టులో వాదించారు. ఇరు పక్షాల వాదలను విన్న తర్వాత తదుపరి విచారణను సోమవారానికి హైకోర్టు వాయిదా వేసింది.

మరోవైపు దేవినేని ఉమను తమ కస్టడీకి ఇవ్వాలని జిల్లా కోర్టులో పోలీసులు పిటిషన్ వేశారు. ప్రస్తుతం దేవినేని ఉమ రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్నారు. ఆయనపై హత్యాహత్నం, కుట్రతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి.

# ఏపీలో మరోసారి కర్ఫ్యూ పొడిగింపు.. కొత్త టైమింగ్స్ ఇవే!

అమరావతి, జులై 30:ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మరో రెండు వారాల పాటూ నైట్ కర్ఫ్యూను పొడిగించింది.

రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ అమల్లో ఉంటుంది. ఆగస్టు 14 వరకు కర్ఫ్యూ ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఒకవేళ ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. అలాగే అందరూ కోవిడ్ ప్రోటోకాల్స్ తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వం పేర్కొంది.

రాష్ట్రంలోని 13 జిల్లాల్లో రోజూ రాత్రి 10 గంటల నుంచి మరుసటిరోజు ఉదయం 6గంటల వరకు కర్ఫ్యూ అమలులో ఉంటుంది. కార్యాలయాలు, సంస్థలు, వ్యాపార సముదాయాలు, దుకాణాల్లోకి మాస్కులు లేని వారిని అనుమతిస్తే రూ.10వేల నుంచి రూ.20వేల వరకు జరిమానా విధిస్తారు. జరిమానా మొత్తాన్ని అక్కడి పరిస్థితుల ఆధారంగా ఖరారు చేస్తారు. అలాగే 2-3 రోజులపాటు సంబంధిత సంస్థను మూసివేసేలా చర్యలు తీసుకుంటారు. కోవిడ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించి తమకు ఆ ఫొటోలు పంపితే నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటారు. దీనికోసం ప్రత్యేకంగా వాట్సప్ నెంబరును ప్రకటించారు. మరోవైపు మాస్కులు ధరించని వారి నుంచి రూ.100 జరిమానా విధించే అధికారాన్ని ఎస్‌ఐలు సహా ఆపై పోలీసు అధికారులకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఈ అధికారం వైద్యాధికారులకు మాత్రమే ఉండేది.

## కేంద్ర మంత్రిత్వ శాఖలలో లైంగిక వేధింపుల ఫిర్యాదులు

న్యూఢిల్లీ, జులై 30:పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను నమోదు చేయడానికి వీలుగా " సెక్సువల్ హెరాస్‌మెంట్ ఎలక్ట్రానిక్ బాక్స్"(షీ-బాక్స్) పేరుతో ఆన్‌లైన్ ఫిర్యాదు పోర్టల్‌ను మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎండబ్ల్యుసిడి) అభివృద్ధి చేసింది. షీ-బాక్స్‌లో ఫిర్యాదు నమోదు అయిన తర్వాత ఈ విషయంలో చర్య తీసుకోవడానికి అధికార పరిధి ఉన్న సంబంధిత అధికారికి ఇది నేరుగా చేరుతుంది. అటువంటి ఫిర్యాదులపై చర్య తీసుకోవాల్సిన బాధ్యత అలాగే షీ-బాక్స్‌లో స్టేటస్ అప్‌డేట్ అయ్యేలా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలు/ విభాగాలపై ఉంటుంది.

ప్రస్తుతం వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలకు సంబంధించి షీ-బాక్స్‌లో మొత్తం 391 ఫిర్యాదులు వచ్చాయి. 01.01.2020 నుండి వీటిలో 150 ఫిర్యాదులు వచ్చాయి. షీ బాక్స్‌లో నమోదైన ఫిర్యాదులపై చర్యలు నిర్దేశించిన విధానం ప్రకారం సంబంధిత మంత్రిత్వ శాఖ / శాఖ బాధ్యత తీసుకుంటాయి. షీబాక్స్ వద్ద నమోదైన 36 కేసుల విశ్లేషించిన అనంతరం కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపుల కేసులు 2 మాత్రమే ఉన్నాయని వెల్లడయింది. పోర్టల్‌లో 3 ఎంట్రీలు ఒకే వ్యక్తిపై ఫిర్యాదుకు సంబంధించినవి. మిగతా 32 కేసులు మహిళలపై హింస, వరకట్న వేధింపులు, దుర్వినియోగం, సూచనలు మొదలైన వాటికి సంబంధించిన వివిధ విషయాలపై ప్రజల ఇబ్బందులకు సంబంధించినవి ఉన్నాయి. అంతేకాకుండా మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు సంబంధించిన కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపుల కేసులు 2 కూడా లేవు.

దేశంలో మహిళల భద్రత మరియు కార్యాలయంలో సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం "కార్యాలయంలో మహిళల లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిష్కార) చట్టం, 2013" (ఎస్‌హెచ్ చట్టం) ను అమలు చేసింది. ఇది కార్యాలయంలో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మహిళలకు రక్షణ కల్పించడం మరియు నివారణ మరియు పరిష్కారానికి ఉద్దేశించబడింది ప్రభుత్వ లేదా ప్రైవేట్, వ్యవస్థీకృత లేదా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారి వయస్సు, ఉద్యోగ స్థితి లేదా పని స్వభావంతో సంబంధం లేకుండా మహిళందరికి సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించబడతాయి.

ఈ చట్టం అన్ని కార్యాలయాల యజమానులు, ప్రభుత్వ లేదా ప్రైవేటు కార్యాలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించే బాధ్యతను కలిగి ఉంది. తద్వారా ప్రతి యజమాని ఉద్యోగులు / కార్మికుల సంఖ్య పది లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే అంతర్గత కమిటీ (ఐసి) ను ఏర్పాటు చేయవలసి ఉంటుంది.

మహిళా స్నేహపూర్వక పని వాతావరణాన్ని సృష్టించేలా ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేయడానికి ఎమ్‌డబ్ల్యుసిడి ఎప్పటికప్పుడు రాష్ట్రాలు / యుటీలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు / విభాగాలకు సలహాలు జారీ చేసింది.

## అక్రమ రవాణాలో ఇంటర్నెట్ పాత్ర

న్యూఢిల్లీ, జులై 30:సైబర్ నేరాలను అరికట్టడానికి, ఇంటర్నెట్ ఆధారంగా జరిగే దోపిడీలను నివారించడానికి సమాచార సాంకేతిక చట్టం-2000లో పలు నిబంధనలున్నాయి. భారత రాజ్యాంగంలో 7వ షెడ్యూల్ ప్రకారం 'పోలీసులు' మరియు 'పబ్లిక్ ఆర్డర్' అనేవి రాష్ట్రం పరిధిలోని అంశాలు. సైబర్ నేరాలతో సహా.. చట్టాలను అమలు చేసే సంస్థల ద్వారా నేరాల నివారణ, గుర్తింపు, దర్యాప్తు, విచారణకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన బాధ్యత వహిస్తాయి. చట్టాలను అమలు చేసే సంస్థలు నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాయి. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సామర్థ్యాలను పెంచడం కోసం వివిధ పథకాల కింద ఆదేశాలు జారీ చేయడం, సూచనలు, హెచ్చరికలు చేయడంతోపాటు ఆర్థిక సహాయం అందిస్తుంది.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ లను ఏర్పాటుచేయడం, జూనియర్ సైబర్ కన్సల్టెంట్ల నియామకం, అవసరమైన శిక్షణ ఇవ్వడం కోసం సైబర్ క్రైమ్ ప్రివెన్షన్ విమెన్ ఉ చిల్డ్రన్ (సిసిపిడబ్ల్యుసి) పథకం కింద అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆర్థిక సహాయం అందించింది. కేంద్ర ప్రభుత్వం చూపిన ఈ చొరవతో ఇప్పటిదాకా 18 రాష్ట్రాల్లో సైబర్ ఫోరెన్సిక్ లాబొరేటరీలు, శిక్షణ కేంద్రాలను ప్రాంభించారు. అంతేకాకుండా సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, హెచ్చరికల జార, దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచడం, చట్టాన్ని అమలు చేసే సిబ్బందికి శిక్షణ, ప్రాసిక్యూటర్లు, జ్యుడిషియల్ అధికారులు, సైబర్ ఫోరెన్సిక్ సౌకర్యాలను మెరుగుపర్చడం వంటి వాటిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సైబర్ నేరాల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ను ఏర్పాటుచేసింది. దీనిద్వారా సైబర్ నేరాల దర్యాప్తు కోసం అవసరమైన మార్గదర్శకాలను రూపొందించడంతోపాటు, సమగ్ర, సహకార పద్ధతిలో సైబర్ నేరాల దర్యాప్తు జరిగేలా చూస్తోంది. మహిళలు మరియు పిల్లలపై జరిగే సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, అన్ని రకాల సైబర్ నేరాలకు సంబంధించిన సంఘటనలను నివేదించే సదుపాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవడానికి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (లిలిలి.ఞ.ఎవఎవతీఞతీతీఎవ.ఞనీల.తిని) అందుబాటులోకి తెచ్చింది. ఆన్‌లైన్ సైబర్ ఫిర్యాదులను నమోదు చేయడంలో సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 155260 కూడా పనిచేస్తోంది.

## గ్రామీణ మహిళల సాధికారత

న్యూఢిల్లీ, జులై 30:మహిళల రక్షణ, భద్రత, సాధికారతను ఒకే గొడుకు కిందకు తెచ్చే భారత మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఈ ఆర్థిక సంవత్సరం నుంచే 'మిషన్ శక్తి' పేరుతో మహిళా సమగ్ర సాధికారత కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కోసం పనిచేస్తున్న రాష్ట్ర, జిల్లాస్థాయి హబ్ లు, మహిళా సహాయ కేంద్రాలు, వన్ స్టాప్ సెంటర్లు, బేటీ బచావో బేటీ పడావో, సఖి నివాస్, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్, శక్తి సదన్స్, మహిళా గృహాలను భాగస్వాములను చేయాలని నిర్ణయించింది.

సమాజ భాగస్వామ్యం ద్వారా గ్రామీణ మహిళలను శక్తివంతం చేయడానికి, ప్రభుత్వ పథకాలు మరియు కార్యక్రమాలకు అనుసంధానం చేయడానికి.. అవగాహన కల్పించడానికి కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ 2017, నవంబర్ నుండి మహిళా శక్తి కేంద్రం (ఎంఎస్‌కె) పథకాన్ని అమలు చేస్తోంది. జిల్లా స్థాయిలో బేటీ బచావో బేటీ పఢావో (ఞఞఖ) పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలయ్యేలా చేయడం మహిళా శక్తి కేంద్రం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కింద 2018-19 నుండి 2020-21 వరకు కేటాయించిన నిధులను అనుబంధంలో చూడవచ్చు.

దేశంలోని గ్రామీణ మహిళల సమగ్ర పురోగతికి భారత ప్రభుత్వంలోని ఇతర మంత్రిత్వ శాఖలు కూడా పలు చర్యలు తీసుకుంటున్నాయి. వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ క్రింద, వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ యొక్క వివిధ లబ్ధిదారుల ఆధారిత పథకాల ద్వారా మహిళా రైతులపై కనీసం 30% ఖర్చు పెట్టేలా మార్గదర్శకాలు చేస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి మరియు వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ... స్వల్పకాలిక శిక్షణ (ఎస్‌టిటి) మరియు రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ (ఆర్‌పిఎల్) ప్రధానాంశంగా ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై) ను అమలు చేస్తుంది. పిఎంకెవివై కింద, గ్రామీణ మహిళలతో సహా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి మరియు వారి జీవనోపాధిని సంపాదించుకోవడానికి స్వల్పకాలిక నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. 10.07.2021 నాటికి 47,21,529 మంది మహిళా అభ్యర్థులకు పిఎంకెవివై కింద శిక్షణ ఇచ్చారు.

# ఆ పథకాలన్నీ గత బడ్జెట్‌లోనివే : గుత్తా సుఖేందర్ రెడ్డి



నల్లగొండ, జులై 30:: హుజురాబాద్ నుంచి ప్రవేశపెట్టనున్న పథకాలన్నీ గత బడ్జెట్‌లోనివేనని శాసనమండలి మాజీ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. చిట్యాల మండల కేంద్రంలో గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో సీఎం కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ పార్టీ మాత్రమే అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు.

ఈ జిల్లాకు సంబంధించిన మంత్రితో ప్రజల ముందు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మైక్ లాక్కుని చేసిన పని సరైంది కాదన్నారు. హుజురాబాద్‌లో ప్రవేశపెట్టిన పథకాలన్నీ గత బడ్జెట్లో పెట్టినవే. ఇప్పుడు అమలు చేస్తున్నాం తప్ప ఎన్నికల కోసం ఆర్భాటంగా చేసిన పథకాలు కావని గుత్తా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేయొద్దన్నారు. ఇకనైనా రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన విలువైన సూచనలు చేయాలని హితవు పలికారు.

# ప్రజలు సమస్యలతో సతమవుతుంటే కుమ్ములాటలతో సర్కార్ బిజీ'

జైపూర్, జులై 30:: రాజస్థాన్‌లో కాంగ్రెస్ సర్కార్ తప్పుడు విధానాలు, అంతర్గత కలహాలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్ విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని అశోక్ గెహ్లో?త్ సర్కార్‌పై కేంద్ర మంత్రి విరుచుకుపడ్డారు. దళితులు, మహిళలపై వేధింపులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం రెండు గ్రూపులుగా విడిపోయి కుమ్ములాటల్లో మునిగితేలుతోందని ఆరోపించారు. కాగా రాజస్థాన్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు తీవ్రమైన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడేందుకు ఎలాంటి వ్యూహాలు చేపట్టాలనే దానిపై రాజస్థాన్ ఏఐసీసీ ఇన్‌చార్జ్ అజయ్ మాకెన్ ఇటీవల ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో మూడు రోజుల పాటు చర్చించారు. రాష్ట్రంలో జిల్లా, బ్లాక్ స్థాయిలో పార్టీ అధ్యక్షుల నియామకం చేపడతామని మాకెన్ పేర్కొన్నారు.

# అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులు




హైదరాబాద్ , జులై 30:అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కొత్త కార్డుదారులకు వచ్చే నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. బుధవారం రాంనగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ కమ్యూనిటీహాల్‌లో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గం పరిధిలోని పౌరసరఫరాల శాఖ మూడు సర్కిళ్ల ఏఎస్ఓలతో కలిసి రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన అబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారని, వారందరికీ త్వరలోనే కొత్త రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. రేషన్ కార్డులు రాని వారు ఆందోళన చెందవద్దని త్వరలోనే మరిన్ని కార్డుల జారీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో కొత్తగా 3,791 మందికి కొత్త రేషన్ కార్డులు వచ్చాయని తెలిపారు. డీఎస్ఓ రమేశ్, ఏఏఎస్ఓలు రమావత్ తూక్యా నాయక్, చామెుండేశ్వరీ, బాలరాజు, రాంనగర్ కార్పొరేటర్లు రవిచారి, ఎన్.సుప్రియాగౌడ్, టీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, ఆర్.మోజస్, ఎర్రం శేఖర్, గోక నవీన్, మధు, గజ్జెల సంపూర్ణ, తులసి, శోభ తదితరులు పాల్గొన్నారు.

# ఈటలకు ధీటైన టీఆర్ఎస్ అభ్యర్థి ఎవరు?

హైదరాబాద్ , జులై 30:హుజూరాబాద్ ఉప ఎన్నిక అన్ని పార్టీల్లో ఉత్కంఠ రేపుతోంది. ఉపఎన్నికకు నోటిఫికేషన్ ఇంకా రాకపోయినా.. గెలుపు ఎవరిని వరిస్తుంది? అన్నది ఆసక్తిరేపుతోంది. టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉన్నా.. ఈటల వర్సెస్ టీఆర్ఎస్ అన్నట్లుగా ఎన్నిక జరగనుంది. బీజేపీ నుంచి ఈటల ఉండగా.. టీఆర్ఎస్ అభ్యర్థిపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. పార్టీ అభ్యర్థిగా కేసీఆర్ ఎవరిని ఎంపిక చేస్తారు? గులాబీ దళపతి మనసులో ఉన్న వ్యక్తి ఎవరు? అన్నది సస్పెన్స్ గా మారింది.

మరి కొద్ది రోజుల్లో ఉపఎన్నికను ఈసీ నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికపై సీఎం కేసీఆర్ ఫోకస్ పెట్టారు. ఈటల రాజేందర్‌కు ధీటైన అభ్యర్థిని నిలబెట్టాలన్న సంకల్పంతో కసరత్తు చేస్తున్నారు. ఎర్రవల్లిలోని తన వ్యవసాయక్షేత్రంలో మంత్రులు హరీశ్ రావు, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్‌తో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇటీవల ప్రకటించిన దళితబంధుపై నియోజకవర్గ ప్రజల్లో జరుగుతున్న చర్చ గురించి కూడా ఆరా తీసినట్లు సమాచారం. పలు పార్టీల నేతల చేరికల అనంతరం పార్టీ పరిస్థితిపై ఇన్‌చార్జ్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది.

మాజీ మంత్రి ఈటల రాజీనామా అనంతరం టీఆర్ఎస్ అభ్యర్థిపై చర్చ సాగుతోంది. టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగబోతున్నారంటూ ఇప్పటికే చాలా మంది పేర్లు వినిపించాయి. అయితే కేసీఆర్ మాత్రం ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదు. హుజురాబాద్ టికెట్ తనకే అంటూ ధీమాతో ఉన్న కౌశిక్ రెడ్డికి సైతం ఇంకా ఎలాంటి క్లారిటీ లేదు. హుజురాబాద్ లో గెలుపు కోసం ఇప్పటికే వివిధ పార్టీలకు చెందిన నాయకులను గులాబీ గూటిలో చేర్చుకున్న కేసీఆర్.. తమ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేయాలి అనేదానిపై విస్తృత చర్చలు జరుపుతున్నారు.

అయితే, ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈటలను ఓడించడం అంత సులువు కాదని కేసీఆర్ కు బాగా తెలుసు. ఎన్నికల్లో ఈటలను ఓడించడమే ప్రధాన అజెండాగా పెట్టుకున్న గులాబీ దళపతి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఒవైపు సామాజిక సమీకరణలు, మరోవైపు అభివృద్ధి మంత్రంతో ఓట్లు రాబట్టాలని కేసీఆర్ యోచిస్తున్నారు.

మరోవైపు హుజురాబాద్ నియోకవర్గంలో ఈటల పాదయాత్రతో దూసుకుపోతున్నారు. దీంతో అభ్యర్థి విషయంలో ఇంకా ఆలస్యం చేయకూడదని కేసీఆర్ భావిస్తున్నారు. కౌశిక్ రెడ్డి సహా మరో నలుగు పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నారు. గతంలో తెలంగాణ సెంటిమెంట్ తో పలు ఎన్నికల్లో గెలిచిన ఈటలకు ఇప్పుడు ఛాన్స్ లేదని అధికార పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇన్నాళ్లు కేసీఆర్ ఫోటో చూసే ఈటలను గెలిపించారని చెబుతున్నారు. ఇప్పుడు కూడా కేసీఆర్ ఫోటో చూసే జనం ఓట్లు వేస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద టీఆర్ఎస్ అభ్యర్థిని మరో వారం రోజుల్లో ఫైనల్ చేస్తారనే టాక్ వినిపిస్తోంది.

# ఈటల ఖాతాలో 'దళిత బంధు'

హైదరాబాద్ , జులై 30:హుజూరాబాద్ ఉప ఎన్నిక రాజకీయ వేడి పెంచుతోంది. ఓవైపు ఉపఎన్నిక.. మరోవైపు దళిత బంధు పథకం అమలుపై సర్వత్ర చర్చ జరుగుతోంది. ఉప ఎన్నికలో ఈటలను ఢీ కొట్టేందుకు దళిత బంధుతో కేసీఆర్ భారీ స్కెచ్ వేశారు. ప్రస్తుతం ఈటల వర్సెస్ టీఆర్ఎస్ అన్నట్లుగా హుజురాబాద్ లో సీన్ కనిపిస్తోంది. హుజురాబాద్ అభ్యర్థిని టీఆర్ఎస్ పార్టీ ఇంకా ఖరారు చేయనప్పటికీ ఓటర్లను ఆకర్షించే పనిలో కేసీఆర్ బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో దళిత బంధు పథకాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ప్రభుత్వ పథకాన్ని ఓ వర్గం స్వాగతిస్తుండగా? ఇది కేసీఆర్ ఎన్నికల స్టంట్ అని ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయి. అయితే, అంతిమంగా దళిత బంధు క్రెడిట్ మాత్రం ఈటల ఖాతాలో పడిందని టాక్ వినిపిస్తోంది.

హుజురాబాద్ ఉపఎన్నికలో ఈటలకు దళిత ఓట్ల పడకుండా ఉండేందుకు వ్యూహాత్మకంగా దళిత బంధు పథకం రచన చేశారు కేసీఆర్. దీని ద్వారా వందల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈటల రాజీనామా, ఉపఎన్నికలో ఓటమి భయంతోనే కేసీఆర్ దళిత బంధును తెరపైకి తెచ్చారని ఈటల వర్గం అంటోంది. ఈటల వల్లే ఈ పథకం సాధ్యమైందని, ఈటల టీఆర్ఎస్ లోనే ఉంటే ఈ పథకం వచ్చేదా? అని ప్రశ్నిస్తున్నారు.

హుజురాబాద్ నియోజకవర్గంలోని విలాసాగర్ గ్రామంలో ఈటల రాజేందర్ కాళ్లను దళితులు పాలతో కడిగారు. అదే సమయంలో ఈటల రాజేందర్ కూడా వారి కాళ్లు మొక్కారు. ఈటల రాజీనామా చేయడం వల్లే దళితబంధు, ఇతర అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని ఈ సందర్భంగా దళితులు వ్యాఖ్యానించారు. దళితులు తన కాళ్లు కడుగుతానని వస్తే రాజకీయ నాయకులు ఎక్కడ విమర్శిస్తారో అని ముందుగా తానే వాళ్ల కాళ్లకు మొక్కానని ఈటల చెప్పారు. ఈ క్రమంలో దళిత ఓట్లు కూడా ఈటలకే పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఉపఎన్నిక గెలుపును అధికార టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకునేందుకు సీఎం కేసీఆర్ స్కెచ్లు వేస్తుంటే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి టీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయ పార్టీ తమదేనని చాటి చెప్పాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు యోచిస్తున్నాయి.

# తెలంగాణలో సెప్టెంబర్ 1 నుంచి వర్క్ ఫ్రమ్ హోం బంద్?

హైదరాబాద్ , జులై 30:కరోనా కారణంగా గత ఏడాది మార్చి నుంచి పలు ఐటీ సంస్థలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం సౌకర్యాన్ని కల్పించాయి. కరోనా పూర్తిగా తగ్గేవరకు వారు ఇంటి నుంచే పని చేసుకోవచ్చని ఆయా సంస్థలు ఇప్పటికే స్పష్టం చేశాయి. ఇప్పట్లో పూర్తి స్థాయిలో కార్యాలయాలను తెరవడానికి ఐటీ కంపెనీలు విముఖత వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా పలు ఐటీ కంపెనీల ప్రతినిధులతో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయు కంపెనీల ప్రతినిధులకు ఆయన పలు సూచనలు చేశారు. ఇకపై వర్క్ ఫ్రం హోం వద్దని, ఉద్యోగులను క్రమంగా కార్యాలయాలకు పిలిపించాలని ఆయా కంపెనీలను కోరారు.

ప్రభుత్వ కార్యాలయాల నుంచి కూడా 100 శాతం మంది ఉద్యోగులు పని చేసేలా చూస్తున్నామని ఈ సమావేశంలో జయేశ్ రంజన్ చెప్పినట్లు తెలుస్తోంది. ఐటీ కంపెనీలు 100 శాతం మంది ఉద్యోగులను కార్యాలయాల నుంచే పనిచేసేలా చూడాలని తెలంగాణ ప్రభుత్వం సూచించింది.

ఈ మేరకు సెప్టెంబరు 1 నుంచే కార్యాలయాల నుంచే ఉద్యోగులతో పనులు చేయించేలా చూడాలని చెప్పింది. ఇందుకు ఐటీ సంస్థలు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కోరింది. అయితే ప్రభుత్వ సూచన పట్ల పలు ఐటీ సంస్థలు విముఖత వ్యక్తం చేశాయి. వర్క్ ఫ్రం హోం వల్ల తమ ఉద్యోగులు మరింత మెరుగ్గా పనిచేస్తున్నారని చెప్పాయి. గూగుల్, కాగ్నిజెంట్ వంటి పెద్ద కంపెనీలు కూడా అక్టోబరు వరకు వర్క్ ఫ్రం హోం ఇస్తామని ఇప్పటికే ప్రకటించాయని పలు కంపెనీల ప్రతినిధులు గుర్తు చేశారు. వర్క్ ఫ్రం హోం వల్ల అవుట్ పుట్ ఎక్కువగా వస్తోందన్నారు.

మరోవైపు దేశంలో మూడో దశ కరోనా విజృంభణ తప్పదని పలువురు నిపుణులు హెచ్చరించిన అంశాన్ని కూడా ఆయా కంపెనీల ప్రతినిధులు జయేశ్ రంజన్‌కు గుర్తు చేశారు. దీంతో ఉద్యోగులకు వైరస్ సోకకుండా చర్యలు తీసుకుంటామని, ఐటీ ఉద్యోగులందరి కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వ్యాక్సిన్లు వేస్తామని జయేశ్ రంజన్ చెప్పారు. అంతేగాక, ఆయా కంపెనీల వెలుపల కరోనా పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ ఆయా ఐటీ కంపెలు తమ ఉద్యోగులను రిస్క్‌లో పెట్టలేమని తేల్చి చెప్పాయి.

దీంతో ఈ అంశంపై ఐటీ శాఖ ఉన్నతాధికారులు, ఐటీ కంపెనీల ప్రతినిధులతో ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కార్యాలయాల్లో ఉద్యోగులతో విధులు నిర్వహించేలా చేయడం, అందుకు తగ్గ విధివిధానాలను ఖరు చేయడం వంటి అంశాలపై ఈ కమిటీ నివేదిక అందించనుంది. కొన్ని రోజుల్లో ఈ కమిటీ సమావేశం కానుంది. ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఇవ్వడం వల్ల ఐటీ కంపెనీలు, ఆ సంస్థల ఉద్యోగులకు మేలు జరుగుతున్నప్పటికీ వారి మీద పరోక్షంగా ఆధారపడి వ్యాపారాలు చేసుకుంటున్న వారికి మాత్రం నష్టాలు వస్తున్నట్లు తెలుస్తోంది. అంటే రియల్ ఎస్టేట్, ట్రాన్స్‌పోర్ట్, ఆతిథ్య రంగాల వంటి వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐటీపై ఇతర రంగాలు ఆధారపడడంతో ప్రభుత్వం ఆ సంస్థల ఉద్యోగులను కార్యాలయాల నుంచే పనిచేసుకోనివ్వాలని భావిస్తోంది. దీనిపై ఏర్పాటు చేసిన కమిటీ ఆగస్టు తొలివారంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



రంగారెడ్డి, జులై 30:: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రజలు విశ్వసిస్తున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలం పద్మారం గ్రామ పంచాయతీలోని రాంజతాండకు చెందిన 40మంది కాంగ్రెస్ నాయకులు టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హఫీజ్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్నారని తెలిపారు.

దళితబంధు పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయడానికి సిద్ధపడటం గొప్ప విషయమన్నారు. అభివృద్ధి కోసం అన్ని పార్టీల వారు సహకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు కోనెరు నర్సింగరావు, కొండి యాదయ్య, నారాయణగౌడ్, మల్లేష్, కుర్వ నర్సింహులు, రమేష్, వీరన్న, వంశి, బోయ బాల్‌రాజు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్టీపీకి కీలక నేత రాజీనామా

హైదరాబాద్ , జులై 30:తెలంగాణలో రాజన్న రాజ్యం తేస్తానంటూ పార్టీ పెట్టిన వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిలకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ఆ పార్టీలో ఆధిపత్య పోరు మొదలైందనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పార్టీకి కీలక నేత గుడ్ బై చెప్పి షర్మిలకు షాక్ ఇచ్చారు. వైఎస్సార్టీపీ కీలక నేత చేవెళ్ల ప్రతాప్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. వైఎస్ఆర్టీపీ నేత రాఘవ రెడ్డి వ్యవహారశైలికి నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని పార్టీ కార్యాలయానికి ప్రతాప్ రెడ్డి పంపారు. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వైఎస్సార్టీపీ ఇన్‌చార్జ్‌గా ప్రతాప్‌రెడ్డి ఉన్నారు. కొత్తగా పెట్టిన పార్టీని ప్రజల్లో తీసుకెళ్లాల్సిన సమయంలో కీలక నేత రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.

# థియేటర్లు ఓపెన్.. సినిమా హాళ్ల వద్ద సందడి

హైదరాబాద్ , జులై 30:తెలంగాణలో కరోనా సెకండ్ వేవ్?తో విజృంభించడంతో మూతపడిన సినిమా థియేటర్లు మళ్లీ తెరుచుకున్నాయి. పలు కొత్త సినిమాలు రిలీజ్ అవ్వడంతో థియేటర్ల వద్ద సినీ ప్రియులు సందడి చేస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత హైదరాబాద్ నగరంలో తిరిగి థియేటర్లు తెరుచుకున్నాయి. 100 శాతం ఆక్యుపెన్సీతో సినిమాలను ప్రదర్శించనున్నారు. దీంతో పలు థియేటర్ల వద్ద సందడి వాతావరణం నెలకొంది. శుక్రవారం పలు కొత్త సినిమాలు విడుదల నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్?లోని థియేటర్లలో రద్దీగా ఉంది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో నేటి నుంచి పార్కింగ్ చార్జీలు కూడా అమలుకానున్నాయి.

ఇక, ఏపీలో 50 శాతం ఆక్యుపెన్సీతో పర్మిషన్ ఇచ్చారు. ఇటీవల కర్ఫ్యూ సమయాల సడలింపులు ఇచ్చే సందర్భంలోనే థియేటర్ల రీ ఓపెనింగ్?కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నలిచ్చింది. అయితే, నిర్మాతలతో ఎగ్జిబిటర్ల వివాదం ఓ కొలిక్కిరాకపోవడంతో థియేటర్లు తెరుచుకోవడం ఆలస్యమైంది.

ఇదిఇలా ఉంటే.. ఏపీలో నైట్ కర్ఫ్యూను ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఈ నేపథ్యంలో సినిమా థియేటర్లు తెరుస్తారా? లేదా? అన్నది ఉత్కంఠగా మారింది. ఫ్యామిలీ ప్రేక్షకులు అధికంగా నైట్ షోలకే థియేటర్లకు వస్తారు. అయితే, ప్రభుత్వం కర్ఫ్యూను రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటలవకు అమలు చేయనుంది. ఈ క్రమంలో రోజుకు మూడు ఆటలతో థియేటర్లు ప్రదర్శించే అవకాశం ఉంది.

# శ్రీశైలం జలాశయం నుంచి కొనసాగుతోన్న నీటి విడుదల




నాగర్‌కర్నూల్, జులై 30: : శ్రీశైలం జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. 10 గేట్లను 20 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఇన్ ఫ్లో 5,00,203 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 5,27,323 క్యూసెక్కులుగా ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు. ప్రస్తుత నీటిమట్టం 884.10 అడుగులు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 211.5133 టీఎంసీలు. ప్రాజెక్టు 10 గేట్లను ఎత్తడంతో.. ఆ దృశ్యాలను తిలకించేందుకు పర్యాటకులు భారీగా పోటెత్తారు.

# అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ భూములు కాపాడండి..!

## -ముస్లిం సంఘాల వినతి



రాజన్న సిరిసిల్ల, జులై 30:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో సర్వే నెంబర్ 41,42,43 అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ భూములను పరిరక్షించాలని కోరుతూ శుక్రవారం పట్టణ ముస్లింలు సంబంధిత అధికారులు పట్టణ తహశీల్దార్ మునీందర్, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థం మాధవి రాజు,పట్టణ సీఐ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ శ్యాం సుందర్ రావు,లకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తిప్పా పూర్ లోని వక్ఫ్ భూములు అన్య కాంతమవుతున్నాయని కొందరు దర్జాగా కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వారి బారి నుండి వక్ఫ్ భూములు రక్షించి ముస్లిం షాదీ ఖానా నిర్మించి ఇల్లు లేని పేద ముస్లిం లకు డబల్ బెడ్ రూమ్ లు కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ ఐదు మసీదులకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై కృషి చేస్తా..!

సంగారెడ్డి జులై 30 (నేటినిజం ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ గా శుక్రవారం నాడు రమణ కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పోలీస్ సమస్యలు ప్రజా సమస్యలపై నిరంతరం అధికారుల సహాయసహకారాలతో కృషి చేస్తానని సమావేశంలో తెలిపారు ప్రజా సమస్యలపై ప్రజలు ఎవరైనా నిర్భయంగా పోలీస్ స్టేషన్లకు వచ్చి ఫిర్యాదు చేసుకోవచ్చని ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహించి రామగుండం కమిషనర్ గా బదిలీపై వెళ్తున్న ఎస్పీ చంద్రశేఖర్రెడ్డి ను పోలీస్ అధికారులు సిబ్బంది ఆయనకు ఘనంగా వీడుకోలు తెలిపారు







# అదరగొట్టిన లవ్లీనా..భారత్‌కు మరో పతకం ఖాయం..



టోక్యో,జులై 30: ఒలింపిక్స్‌లో ఇండియన్ కు మరో మెడల్ ఖాయమయింది. 64-69 కేజీల విభాగంలో క్వార్టర్‌ఫైనల్లో లవ్లీనా అద్భుతమైన విజయం సాధించింది. చైనీస్ తైపీకి చెందిన చెన్ చిన్‌పై 4-1 తేడాతో గెలిచింది. ఈ విజయంతో ఆమె సెమీఫైనల్లో అడుగుపెట్టింది. బాక్సింగ్ సెమీస్ ఫలితంతో సంబంధం లేకుండా ఇండియాకు మరో మెడల్ ఖాయం. సెమీస్‌లో ఒకవేళ లవ్లీనా ఓడినా.. బ్రాంజ్ మెడల్ మాత్రం ఖాయం. లవ్లీనా మూడు రౌండ్లలోనూ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. తొలి రౌండ్‌లో 3:2 తో ఆధిక్యంలో ఉండగా.. రెండో రౌండ్‌లో మొత్తం ఐదుగురు జడ్జీలు లవ్లీనాకే 10 స్కోరు ఇచ్చారు. ఇక మూడో రౌండ్‌లో నలుగురు లవ్లీనా వైపే మొగ్గారు. దీంతో ఆమె 4-1తో గెలిచి సెమీస్‌లో అడుగుపెట్టింది.

ఇక ఆర్చరీ మహిళల వ్యక్తిగత విభాగంలో దీపికా కుమారి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. రౌండ్ ఆఫ్ 8లో భాగంగా రియో ఒలింపిక్స్ రజత పతక విజేత పెరోవాతో జరిగిన పోరులో దీపిక 6-5తో విజయం సాధించింది. ఐదు సెట్లలో దీపిక రెండు సెట్లను గెలుచుకోగా, పెరోవా రెండు సెట్లను దక్కించుకుంది. మరో సెట్ టై అయింది. అయితే, దీపికకు స్విట్ పాయింట్లు దక్కాయి. అనంతరం జరిగిన షూటవుట్‌లో రష్యాకు చెందిన పెరోవా ఏడు పాయింట్లు మాత్రమే సాధించింది. 10 పాయింట్లు సాధించిన దీపిక మ్యాచ్‌ను కైవసం చేసుకుని క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది.

మరోవైపు, మహిళల 60 కేజీల ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో భారత బాక్సర్ సిమ్రన్‌జీత్ కౌర్ ఓటమి పాలైంది. థాయిలాండ్‌కు చెందిన సుదాపోర్న్ చేతిలో 0-5 తేడాతో ఓటమిపాలైంది. అలాగే, మహిళల 25 మీటర్ల ర్యాపిడ్ పిస్టల్ క్వాలిఫికేషన్ రౌండ్‌లోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. 290 పాయింట్లతో మనుబాకర్ 15వ స్థానంతో, సర్నబోత్ రహీ 286 పాయింట్లతో 32వ స్థానంలో నిలిచి ఫైనల్ రౌండ్‌కు అర్హత కోల్పోయారు.

# సెమీస్‌లోకి దూసుకెళ్లిన పి.వి సింధు..



టోక్యో,జులై 30: ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ లో పి.వి సింధు సెమీస్ లో కి అడుగుపెట్టింది సాధించింది. దీంతో పతకానికి మరో అడుగు దూరంలో నిలిచింది. మహిళల సింగిల్స్ విభాగంలోని క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్ క్రీడాకారిణి యమగుచిపై విజయం సాధించింది సింధు. దాంతో మరోసారి భారత్‌కు పతకం ఖాయం చేసేలా కనిపిస్తోంది. తొలి గేమ్‌లో 21-13తో ఆధిపత్యం చెలాయించిన ఆమె రెండో గేమ్‌లోనూ సత్తా చాటింది. రెండో గేమ్ తొలి విరామానికి సింధు 11-6తో ఆధిపత్యం సాధించింది. అయితే విరామం తర్వాత యమగుచి గట్టిపోటీ ఇచ్చింది. ఒక దశలో ఇద్దరి పాయింట్లు సమానంగా నిలిచాయి. ఆఖరివరకు ఉత్కంఠభరితంగా సాగిన రెండో గేమ్‌లో 22-20తో సింధు నెగ్గింది . దీంతో వరుస గేమ్‌లలో గెలిచిన సింధు సెమీస్‌కు దూసుకెళ్లింది. కాగా 2016 లో సింధూ సిల్వర్ మెడల్ గెలుచుకుంది.

# మొక్కలు నాటిన టి-సాట్ సీఈవో శైలేష్ రెడ్డి

హైదరాబాద్ , జులై 30: టి-సాట్ సీఈవో (టి.సాట్-సాఫ్ట్ నెట్) టి-సాట్ నెట్వర్క్ ఛానళ్ల సీఈవో ఆర్. శైలేష్ రెడ్డి శుక్రవారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని తన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ 'గ్రీన్ ఇండియా చాలెంజ్' లో భాగంగా జూబ్లీహిల్స్ లోని టి-సాట్ కార్యాలయ ఆవరణలో రెండు మామిడి మొక్కలతో పాటు, ఏడాకుల మొక్కలను సిబ్బందితో కలిసి నాటారు. ఈ సందర్భంగా శైలేష్ రెడ్డి మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాల క్రితం కార్యాలయ ఆవరణ అంతా ఏడారిగా ఉండేదన్నారు.

ప్రస్తుతం పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారిందన్నారు. నగరంలో పొల్యూషన్ ప్రభావాన్ని ఎదుర్కొని టి-సాట్ కార్యాలయానికి వచ్చి ఆరోగ్యవంతమైన ఆక్సిజన్ పొందడంతో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించవచ్చని గుర్తు చేశారు. ఈ పచ్చదనాన్ని ఇలాగే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

జూలై మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమం సందర్భంగా మంత్రి కేటీఆర్ టి-సాట్ కార్యాలయంలో నిండిన పచ్చదనం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ అభినందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

మంత్రి స్ఫూర్తితో నా పుట్టిన రోజు సందర్భంగా మరో మూడు మొక్కలు నాటాను. అలాగే పచ్చదనం కార్యక్రమాన్ని కొనసాగించే విధంగా భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండేందుకు మనవంతు ప్రయత్నం చేద్దామని పిలుపు నిచ్చారు.



# చిన్నారుల వెన్నుముక కండరాల క్షీణత రోష్ ఎవ్రిస్డీ ఔషధం మార్కెట్లోకి




హైదరాబాద్ , జులై 30:రోష్ నేడు, వెన్నుముక కండరాల క్షీణత (స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ? ఎస్ఎంఏ) రోగుల కోసం భారతదేశంలో ఆమోదించబడిన మొట్టమొదటి మరియు ఒకే ఒక్క చికిత్స ఎవ్రిస్డీ (రిస్డిప్లామ్)ను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఎవ్రిస్డీను మొదటగా యుఎస్ ఎఫ్‌డీఏ ఆగస్టు 2020లో ఆమోదించింది. యుఎస్‌లో అనుమతించబడిన 11 నెలల లోపుగానే ఇప్పుడు ఇండియాలో కూడా లభ్యమవుతుంది. ఆవిష్కరించిన నాటి నుంచి 50కు పైగా దేశాలలోని 4000 ఎస్ఎంఏ రోగులు ఎవ్రిస్డీ నుంచి ప్రయోజనం పొందారు.

అతి తీవ్రమైన, అభివృద్ధి చెందేటటువంటి న్యూరోమస్క్యులర్ వ్యాధి , ఎస్ఎంఏ. దీని వల్ల మరణమూ సంభవించవచ్చు. అంతర్జాతీయంగా ప్రతి 10000 జననాలలో దాదాపు ఒకరిపై ఇది ప్రభావం చూపవచ్చు మరియు భారతదేశంలో 7744 జననాలలో ఒకరిపై ఇది ప్రభావం చూపుతుంది. శిశు మరణాలకు కారణమవుతున్న జన్యు కారణాలలో ఇది అగ్రగామిగా నిలుస్తుంది. సర్వైవల్ మోటర్ న్యూరాన్ 1(ఎస్ఎంఎన్1) జీన్ మ్యుటేషన్ కారణంగా ఎస్ఎంఏ వస్తుంది. దీని కారణంగా ఎస్ఎంఎన్ ప్రోటీన్ లోపిస్తుంది. ఈ ప్రోటీన్, శరీరమంతా కూడా లభ్యమవుతుంది. కండరాలు మరియు కదలికలను నియంత్రించే నరాలు పనిచేయడానికి ఇది తప్పనిసరి. ఈ ప్రోటీన్ లేకుండా నరాలకు సంబంధించిన కణజాలం సరిగా పనిచేయదు.

ఈ ప్రోటీన్ లోపిస్తే కొంత కాలానికి కండరాలు నీరసించిపోతాయి. ఎస్ఎంఏ తరహా అనుసరించి, వ్యక్తుల శారీరక సామర్థ్యం మరియు వారు నడిచే తీరు, ఆహారం తీసుకోవడం లేదా శ్వాసించడం కూడా గణనీయంగా ప్రభావితం కావడం లేదా కోల్పోవడం జరుగవచ్చు. ఎవ్రిస్డీ మరియు అంతర్జాతీయ క్లీనికల్ ట్రయల్ ఎవ్రిస్డీని ప్రతిరోజూ నోటి ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది (పొడి రూపంలో దీనిని సరఫరా చేస్తారు. దీనిని ద్రవ సొల్యూషన్‌తో కలుపుకుని రోజుకు ఒక్కసారి నోటి ద్వారా లేదా అవసరమైన పక్షంలో ఫీడింగ్ ట్యూబ్ ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది).

సర్వైవల్ మోటర్ న్యూరాన్ (ఎస్ఎంఎన్) ఉత్పత్తి వృద్ధి చేయడం ద్వారా ఎస్ఎంఏకు చికిత్సనందించేలా దీనిని రూపొందించారు. వెన్నుముక కండరాల క్షీణత (ఎస్ఎంఏ) చికిత్స కోసం పెద్దలు మరియు రెండు నెలల వయసు దాటిన నవజాత శిశువుల చికిత్సకోసం ఆమోదించారు. ఎవ్రిస్డీను ఎస్ఎంఏ కోసం విస్తృతస్థాయి, భారీ మరియు శక్తివంతమైన క్లీనికల్ ట్రయల్స్ కార్యక్రమంలో భాగంగా 450 మందికి పైగా వ్యక్తులపై అధ్యయనం చేశారు.

ఈ కార్యక్రమంలో నవజాత శిశువులు మొదలు 60 సంవత్సరాల వయసు దాటిన పెద్దల వరకూ, విభిన్నమైన వ్యాధి లక్షణాలు, కదలికల తీరు ఆధారంగా పరీక్షించారు . అంతేకాదు, ఎస్ఎంఏ కోసం ఇతర ఔషదాలతో గతంలో చికిత్స పొందిన వారిని సైతం పరీక్షలలో భాగం చేసిన ఒకే ఒక్క కార్యక్రమమిది. ఎవ్రిస్డీని భారతీయ ఆరోగ్య శాఖ అధికారులు, దీని సమర్థత, భద్రతను మూడు అంతర్జాతీయ క్లీనికల్ అధ్యయనాల నుంచి సమీక్షించి ఆమోదించారు. ఈ అంతర్జాతీయ క్లీనికల్ అధ్యయనాలలో ఎస్ఎంఏతో బాధపడుతున్న విస్తృతస్థాయి ప్రజలకు ప్రాతినిధ్యం వహించేలా రూపకల్పన చేశారు ఫైర్‌ఫిష్ : టైప్ 1 ఎస్ఎంఏ లక్షణాలు కలిగిన 1 నుంచి 7 నెలల వయసు కలిగిన నవజాత శిశువులు రెండు నుంచి 25 సంవత్సరాల లోపు వయసు కలిగిన చిన్నారులు, పెద్దలు.

# ప్రగతి భవన్, ఫామ్ హౌస్‌ను లక్ష నాగళ్లతో దున్ని పేదలకు పంచుతాం: బండి సంజయ్

హైదరాబాద్ , జులై 30:తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ సీఎం కేసీఆర్ పై ఫైర్ అయ్యారు. బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరిపార్క్ వద్ద బడుగుల ఆత్మగౌరవ పోరులో పాల్గొన్న బండి సంజయ్ కేసీఆర్ పై విరుచుకుపడ్డారు. 2023లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రగతి భవన్‌ను, ఫామ్ హౌస్‌ను లక్ష నాగళ్లతో దున్నుతామని, ఆ భూమిని ప్రజలకు పంచుతామని అన్నారు. పోడు భూములను పరిష్కరిస్తామని చెప్పిన కేసీఆర్, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. దళితులకు మూడు ఎకరాల భూమిని ఇస్తామని చెప్పిన కేసీఆర్, ఒక్కొక్క దళితుడికి రూ.10 లక్షలు కాదు, రూ.30 లక్షలు ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో 18శాతం దళితులు ఉన్నారని, వారిలో ఏ ఒక్కరికీ ముఖ్యమంత్రి అయ్యే అర్హతలు లేవా అని బండి సంజయ్ ప్రశ్నించారు.

ఇక హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. ప్రగతి భవనాన్ని కూల్చి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కేసీఆర్ ఫేక్ ఐడీలు సృష్టించి దళితులను మోసం చేస్తున్నారని అన్నారు. హుజురాబాద్‌లో జరుగుతుంది బైపోల్స్ కాదని, కేసీఆర్‌కు బైయింగ్ ఎలక్షన్స్ అని అన్నారు. కేసీఆర్‌పై తెలంగాణ సమాజం విశ్వాసం కోల్పోయిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధిపై సీఎంకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పోడు భూముల్లో చేతికొచ్చిన పంటను నాశనం చేయిస్తున్నారని, ఫారెస్ట్ అధికారులను పంపి పోడు రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈటల బావమరిది చాటింగ్‌పై విచారణ జరిపించాలని సవాల్ చేశారు. నిజంగా ఆయన తప్పు చేస్తే ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. బడుగులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటాలకు బీజేపీ సిద్ధమవుతోందని బండి సంజయ్ స్పష్టం చేశారు

# ప్రజా ఫిర్యాదులను 45 రోజుల్లో పరిష్కరించండి.. కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ, జులై 30:ప్రజా ఫిర్యాదుల పరిష్కార గరిష్ఠ గడువును కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ఇప్పటి వరకు 60 రోజులు గడువు ఉండగా ఇకపై 45 రోజుల్లో ఫిర్యాదులను పరిష్కరించాలని శుక్రవారం ఆదేశించింది. పార్లమెంట్ కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నది. కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కార, పర్యవేక్షణ వ్యవస్థ (అఖఉఖీంటూ)కు గత ఏడాది ప్రజల నుంచి 22 లక్షల ఫిర్యాదులు అందాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 12 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. అయితే గత ఏడాది వచ్చిన మొత్తం ఫిర్యాదులలో 70 శాతం వరకు ఏడు డిపార్ట్‌మెంట్‌లకు చెందినవే. ఆర్థిక సేవల శాఖకు అత్యధికంగా ఐదు లక్షల ఫిర్యాదులు, టెలికాం శాఖకు దాదాపు మూడు లక్షల ఫిర్యాదులు అందాయి. తపాలా శాఖ, కార్మిక మరియు ఉపాధి శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్, రైల్వేలు, ఇతర మంత్రిత్వ శాఖలు, విభాగాలు గరిష్ఠంగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నాయి.కాగా, 2018-2020 మధ్య 8 కేంద్ర ప్రభుత్వ విభాగాలకు 50,000 నుంచి లక్ష ఫిర్యాదులు, నాలుగు డిపార్ట్‌మెంట్‌లపై లక్ష నుంచి రెండు లక్షల వరకు, రెండు శాఖలపై రెండు లక్షలకుపైగా ఫిర్యాదులు అందడంపై పార్లమెంట్ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఫిర్యాదుల పరిష్కార గరిష్ఠ గడువును 60 నుంచి 45 రోజులకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అలాగే పనితీరు, ఫలితాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలకు ర్యాంకులు ఇచ్చేందుకు ప్రభుత్వ సుపరిపాలన సూచిక తరహాలో 'గ్రీవెన్స్ రిడ్రెసల్ ఇండెక్స్' ను అభివృద్ధి చేయాలని కమిటీ సిఫారసు చేసింది. ఫిర్యాదులు ఎక్కువగా ఉన్న శాఖలు, విభాగాలను గుర్తించి వాటిని క్రమబద్ధీకరించడానికి సంబంధిత మంత్రిత్వ శాఖలు సామాజిక ఆడిట్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించింది.

పార్లమెంట్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థలను సంస్కరించి ఫిర్యాదులను తగ్గించడంపై ప్రధాని నరేంద్ర మోదీ దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం మంత్రిత్వ శాఖలు, విభాగాలకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అఖఉఖీంటూ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే లేదా గరిష్ఠంగా 45 రోజుల్లో పరిష్కరిం చాలని ఆదేశించింది. కోవిడ్ -19 కేటగిరీ లోని ఫిర్యాదులను అధిక ప్రాధాన్యత గా పరిగణించి 3 రోజుల్లో పరిష్కరించాలని స్పష్టం చేసింది. సబ్-జ్యూడీస్ విషయాలు, పాలసీ సమస్యలు, ప్రభుత్వ నియంత్రణకు మించిన పరిస్థితుల కారణంగా నిర్దేశిత సమయ వ్యవధిలో పరిష్కారం సాధ్యం కాన ట్లయితే, ఫిర్యాదుదారులకు ఆ మేరకు మధ్య ంతర సమాధానం ఇవ్వాలని కేంద్రం పేర్కొంది.

# ఆలయ ఉద్యోగిని విధుల నుంచి తొలగించాలి



రాజన్న సిరిసిల్ల, జులై 30:(నేటినిజం ప్రతినిధి): పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజన్న ఆలయ ఉద్యోగి ఉపాధ్యాయుల చంద్ర శేఖర్ చేసిన అధికార పార్టీ సంబంధించినటువంటి వాట్సప్ గ్రూపులో ఉండడం ఫేస్బుక్ లో పోస్టు చేయడం వంటి ప్రింట్లను శుక్రవారం ఆలయ ఈవో కు ఇవ్వడం జరిగింది ఈ ఉద్యోగి ఆలయ ఉద్యోగ రాజకీయ నాయకుడు అని అని ప్రశ్నించడం జరిగింది ఆయనను వెంటనే విధుల నుండి తొలగించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి , జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంఘ స్వామి యాదవ్ కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ చిలువేరు శ్రీనివాస్ , అరుణ్ తేజ చారి , బీసీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ నాగుల రాము గౌడ్ పట్టణ ప్రధాన కార్యదర్శి కనీకరపు రాకేష్ , కార్యదర్శి లింగంపల్లి కిరణ్ గేంటల ప్రకాష్ , దాడి మల్లేశం , ఉపాధ్యక్షులు వస్తాదు కృష్ణ , ఖమ్మం గణేష్ తోట రాజేష్ , మేండే రాజు , మగ్రి పెల్లి రోజు , నాగుల మహేష్ తదితరులు ఉన్నారు

# జన్మదినం పరులు జీవితంలో కొంతైనా ఆనందాన్ని నింపాలి

## -లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్
## -లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



రాజన్న సిరిసిల్ల, జులై 30:(నేటినిజం ప్రతినిధి): వేములవాడలో లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంచికి మారుపేరు ఆపదలో నేనున్నానంటూ అప్పన్న హస్తం అందించే లయన్స్ క్లబ్ హైదరాబాద్ గవర్నర్ డాక్టర్ జి. బాబురావు పీ యం జే ఎఫ్, ఎల్ సి ఐ ఎఫ్, ఏరియా లీడర్ జన్మదిన సందర్భంగా వేములవాడ లో అన్నపూర్ణ క్యాంటిన్ వద్ద లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ డాక్టర్ బాబు రావు లయన్స్ క్లబ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక కార్యక్రమాలు చేపట్టి తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి లయన్ వంగపల్లి ప్రశాంత్, లయన్ ఎరవెల్లి రాజశేఖర్,లయన్స్ క్లబ్ ముఖ్య ప్రతినిధులు లయన్ లు కోళ్ల శ్రీనివాస్, డాక్టర్ నాగ రమేష్, తీగల వెంకటేశ్వర్రావు, డాక్టర్ వెంకన్న, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒలింపిక్స్‌లో సత్తా చాటుతున్న భారత మహిళలు

టోక్యో,జులై 30: ఏ క్రీడాకారుడికైనా ఒలింపిక్స్‌లో పతకం సాధించడం అనేది ఓ కల. అందుకే క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పతకం సాధించడానికి ఆరాటపడ ుతుంటారు. అయితే భారత్ సాధించిన గత 10 పతకాల విజేతల్లో ఆరుగురు మహిళలే ఉన్నారు. ఒలింపిక్స్‌లో జరిగే బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, వెయింట్ లిఫ్టింగ్ లాంటి పోటీల్లో గెలవాలంటే కండబలం చాలా అవసరం. సాధారణంగా మహిళల కంటే పురుషులకే కండబలం ఎక్కువగా ఉంటుందని పలువురు భావిస్తారు. కానీ ఒలింపిక్స్‌లో మాత్రం కండబలం విషయంలో భారత పురుషుల కంటే మహిళలే సత్తా చాటుతున్నారు.గత 10 పతకాల సంగతి గమనిస్తే ఆరు పతకాలను మహిళలే కైవసం చేసుకున్నారు. 2012లో లండన్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో బాక్సింగ్ విభాగంలో మేరీకోమ్ (కాంస్యం), మహిళల బ్యాడ్మింటన్ విభాగంలో సైనా నెహ్వాల్ (కాంస్యం), 2016లో రియో ఒలింపిక్స్‌లో బ్యాడ్మింటన్ విభాగంలో పీవీ సింధు (సిల్వర్), రెజ్లింగ్ విభాగంలో సాక్షి మాలిక్ (కాంస్యం), తాజాగా టోక్యోలో జరుగుతున్న ఒలింపిక్స్‌లో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో మీరాబాయి చాను (సిల్వర్), మహిళల బాక్సింగ్‌లో లవ్లీనా (పతకం ఖాయం) ఈ జాబితాలో ఉన్నారు. అటు ఇప్పటికే మహిళల సింగిల్స్ బ్యాడ్మింటన్ విభాగంలో పీవీ సింధు సెమీస్‌కు దూసుకెళ్లింది. సెమీస్‌లో గెలిస్తే సింధు కూడా పతకం సాధించిన మహిళల జాబితాలో చేరనుంది.

# అంతర్జాతీయ విమాన సర్వీసులపై నియంత్రణల పొడిగింపు

న్యూఢిల్లీ, జులై 30:కరోనా మహమ్మారితో అంతర్జాతీయ కమర్షియల్ పాసింజర్ విమాన సర్వీసులపై విధించిన నియంత్రణలను ఆగస్ట్ 31 వరకూ పొడిగించారు. కొవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పౌరవిమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.

ఆగస్ట్ 31 రాత్రి 11.59 గంటల వరకూ ఈ నియంత్రణలు అమల్లో ఉంటాయని డీజీసీఏ స్పష్టం చేసింది. అంతర్జాతీయ సరుకు రవాణా కార్యకలాపాల సేవలు, డీజీసీఏ ప్రత్యేకంగా అనుమతించిన విమానాలకు ఈ నియంత్రణలు వర్తించవని పేర్కొంది. డీజీసీఏ ఎంపిక చేసిన రూట్లలో అంతర్జాతీయ విమానాలను ఆయా సందర్భాలను అనుసరించి అనుమతించే వెసులుబాటు కల్పిస్తారు.

# అంటరానితనం నిర్మూలనకు కృషి చేయాలి



వేములవాడ జులై 30:(నేటినిజం ప్రతినిధి): గ్రామాల్లోని అంటరానితనం నిర్మూలన ప్రతి ఒక్కరు కృషి చేయాలని వేములవాడ అర్బన్ ఆర్ఐ కుమార్ అన్నారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలో అంటరానితనం నిర్మూలన పై శుక్రవారం ఉప సర్పంచ్ తుమ్మల శ్రీనివాస్ అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ ఐ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అంటరానితనాన్ని ప్రదర్శిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. సమాజంలో అన్ని కులాలు సమానమేనని అన్నారు. గ్రామాల్లో కుల వివక్షతకు పాల్పడితే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బూర వజ్రమ్మ బాబు, జడ్పీటీసీ మ్యాకల రవి ఎంపీడీవో నరేష్ ఆనంద్ .అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు దొబ్బల శ్రీనివాస్ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు,

# కరీంనగర్ నూతన పోలీస్ కమిషనర్‌గా వి సత్యనారాయణ భాధ్యతల స్వీకరణ



కరీంనగర్ జులై 30 (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్‌గా వి సత్యనారాయణ శుక్రవారం నాడు భాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీ అయిన పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి నుండి నూతన కమిషనర్‌కు భాధ్యతలను అప్పగించారు. తొలుత గౌరవవందనం స్వీకరించిన నూతన పోలీస్ కమిషనర్ సత్యనారాయణ అనంతరం కమిషనరేట్ కార్యాలయంలో భాధ్యతలను చేపట్టారు. అనంతరం బదిలీపై వెళుతూ భాధ్యతలను అప్పగించిన కమలాసన్‌రెడ్డికి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛాలు అందించారు.

అనంతరం కమిషనరేట్‌లో అమలుకాబడుతున్న పోలీస్ సంస్కరణలు, శాంతిభద్రతల పరిరక్షణ సంబంధించిన అంశాలు, 2017నుండి కమిషనరేట్ దేశవ్యాప్తంగా గుర్తింపు వివిధ అంశాల్లో గుర్తింపు పొందిన అంశాలపై బదిలీపై వెళుతున్న కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి నూతన కమిషనర్‌కు వివరించారు.

నూతన కమిషనర్ సత్యనారాయణ 1999లో డిఎస్‌పిగా పోలీస్‌శాఖలో చేరారు. అదేహోదాలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో పనిచేశారు. మల్కాజ్‌గిరి ఏసిపిగా, తూర్పుగోదావరిజిల్లా రంపచోడవరం(ఓఎస్‌డిగా), అక్కడే అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందారు. 2006లో ఎస్పీగా పదోన్నతి పొందారు. ముఖ్యమంత్రి భద్రతవిభాగం ఛీఫ్ సెక్యూరిటి అధికారిగా 2011 డిసెంబర్ 26నుండి పనిచేశారు. అప్పుడు ముఖ్యమంత్రులుగా కొణిజేటి రోషయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిలు కొనసాగారు. అక్టోబర్ 10నుండి 2014 వరకు హైదరాబాద్ వెస్ట్‌జోన్ డిప్యూటి కమిషనర్‌గా, సౌత్‌జోన్ డిసిపిగా పనిచేశారు. జిల్లాల పునర్విభన అనంతరం నూతనంగా ఏర్పడిన కమిషరేట్లు, జిల్లాల సందర్భంగా రామగుండం కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. గత సంవత్సరం డిఐజిగా పదోన్నతిపొంది అక్కడే కమిషనర్‌గా విధులను నిర్వహిస్తూ శుక్రవారం నాడు కరీంనగర్ కమిషనర్‌గా భాధ్యతలను స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎన్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), పి అశోక్(టౌన్ డివిజన్), ఏసిపిలు విజయసారధి, శ్రీనివాస్, మదన్‌లాల్, తుల శ్రీనివాసరావు, రాములు, ఎస్‌బిఐ రాజేష్‌లతోపాటుగా వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# 5వ డివిజన్ లో డ్రై..డే నిర్వహణ..హరితహారం



కరీంనగర్ జులై 30 (నేటినిజం ప్రతినిధి): నగరంలోని 5వ డివిజన్ లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. డివిజన్లోని ఇండ్లలో, ప్లాట్ లలో నీటి నిల్వలు ఉండే ప్రదేశాల్లో, ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంచకూడదని అవగాహన కల్పించారు. కో కార్పొరేటర్ అజ్హర్ దబీర్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. సైడ్ డ్రైనేజిల్లో, ఇండ్లలో హైపో క్లోరైడ్ పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ వరుణ, ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు కాజమ్ అలీ ఖాన్, ఇర్ఫాన్, హెల్త్ సెంటర్ ఉద్యోగి హమీద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com